ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 23, జనవరి 2025



పటిష్టత పరిశీలనకు ఫీడర్ కాలువపై తవ్వకాలు చేస్తున్న కూలీలు

వెలిగొండ కదిలింది

సీఎం ఆదేశాలతో పనులు పునఃప్రారంభం

వెలిగొండపై కదలిక వచ్చింది. కీలకమైన పనులు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. ఎక్కడి పనులు అక్కడ ఉండగానే ఎన్నికల్లో లబ్ధి కోసం టన్నెల్‌ను జాతికి అంకితం చేస్తున్నామంటూ జగన్మోహన్‌రెడ్డి హడావుడిగా ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. అప్పుడు పూర్తిచేస్తాం.. ఇప్పుడు పూర్తిచేస్తాం అని ఆర్భాటపు ప్రకటనలు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించి వెలిగొండ పెండింగ్ పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టింది.

- మంత్రుల పర్యటన తర్వాత కీలక అంశాలపై దృష్టి
- రెండో టన్నెల్‌లో గ్యాంట్రీ విధానంలో లైనింగ్
- ఫీడర్ కాలువలో 16 కి.మీ లైనింగ్‌కు రూ.206 కోట్లతో ప్రతిపాదనలు
- మరో ఆరు కిలోమీటర్ల మట్టికట్ట పటిష్టతపై సర్వే
- కంభం ఎస్‌డీసీ పరిధిలో పునరావాస చర్యలకు రూ.80కోట్లు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పనుల పూర్తి లక్ష్యం

ఒంగోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన తొలినెలలోనే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష చేసినప్పుడు వెలిగొండపై సమగ్ర నివేదికతోపాటు పనుల పూర్తికి నిర్దిష్ట ప్రతిపాదనలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆపై ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రాజెక్టును సందర్శించారు. మంత్రులు స్వామి, గొట్టిపాటి రవికుమార్‌తోపాటు జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులతో కలిసి టన్నెల్ తవ్వకాలు, ఫీడర్ కాలువలు, పునరావాస కాలనీలను చూశారు. అధికారులతో సమీక్ష చేశారు. 4.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తికి ఏడు ప్యాకేజీలతో చేపట్టారని అధికారులు ఆయనకు చెప్పారు. రూ.8,043కోట్లు మంజూరు కాగా రూ.6,059 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో పనుల కోసం రూ.4,987 కోట్లు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, ఇతరత్రా మరో రూ.1,100 కోట్లు ఖర్చుచేశామన్నారు. మొత్తం ప్రాజెక్టు పూర్తికి మరో రూ.1,700 కోట్లు అవసరమవుతాయని మంత్రికి నివేదించారు. తద్వారా ప్రాజెక్టు వ్యయం రూ.9,741 కోట్లకు చేరుతుందని వివరించారు.

లోపభూయిష్టంగా పనులు

ప్రాజెక్టు నిర్మాణాల్లో కీలకమైన పనులు పూర్తయినప్పటికీ దాదాపు 15ఏళ్ల క్రితం చేయడం వల్ల 22.9 కిలోమీటర్ల ఫీడర్ కాలువల కట్టలు

మిగతా 6వ పేజీలో

రూ.206కోట్లతో ఫీడర్ కాలువల లైనింగ్ పనులు

కీలకమైన ఫీడర్ కాలువలపైనా అధికారులు దృష్టి సారించారు. టన్నెల్ నీరు బయటకు వచ్చే దోర్నాల మండలం కొత్తూరు నుంచి నల్లమల రిజర్వాయర్ వరకు కొండల అంచున దాదాపు 22కిలో మీటర్లు ఈ కాలువ ఉంది. అందులో 16 కి.మీ దూరం కొండల అంచున మట్టి తొలిచి కాలువలు చేయగా ఆరు కి.మీ మేర మట్టికట్టలు వేసి చేశారు. పదిహేనేళ్ల క్రితం చేసిన పనికావడంతో ప్రస్తుతం ఫీడర్ కాలువ అధ్వానంగా ఉంది. తిరిగి దానిని సక్రమంగా చేయడానికి కొండల అంచు తవ్వి కాలువగా వేసిన 16కి.మీ మేర లైనింగ్ అవసరమని ఉన్నతస్థాయి నిపుణులు సూచించారు. దీంతో ఆ మేరకు సర్వే చేసి రూ.206 కోట్లతో లైనింగ్‌కు ప్రాజెక్టు అధికారులు అంచనాలు రూపొందించారు. వాటికి ఉన్నత స్థాయిలోని సెంట్రల్ డిజైన్స్ సంస్థ ఆమోదం తెలిపింది. త్వరలో ఆ పనులు ప్రారంభించాల్సి ఉంది.



టన్నెల్-2లో గ్యాంట్రీ విధానంలో జరుగుతున్న లైనింగ్ పనులు



7

చైతన్య సవారీ..

ఇక్కడ సైకిల్ తొక్కుతున్నది కలెక్టర్ తమీమ్ అన్సారియా. జిల్లాలో ఎక్కువగా జరుగుతున్న బాల్య వివాహాల నిరోధంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె అధికారులతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల స్వయంగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఒంగోలులో బుధవారం ఏర్పాటు చేసిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా 'బాల్య వివాహాలు నిరోధించడం మన బాధ్యత' అన్న నినాదంతో ప్లకార్డుతో ఉన్న సైకిల్‌ను కొద్దిసేపు తొక్కి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లాలో రూ.143కోట్లతో వసతి గృహాలకు మరమ్మతులు
- తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి
- అధికారులకు మంత్రి స్వామి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సంక్షేమ, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.143కోట్లతో హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఆ నిధులతో వెంటనే పనులు పూర్తిచేయాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీలు ఉన్న హాస్టల్స్‌లో సామాజికవర్గంతో సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరుచేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు పెన్షన్ల కోసం ప్రతినెలా వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే డబ్బులు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు అందించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. మాతాశిశు మరణాలు తగ్గించడంతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గుండెపోటు సంభవించినప్పుడు తక్షణమే ప్రమాదాన్ని నివారించేందుకు ఇంజెక్షన్ వేసే స్టెమీ ప్రాసెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు

మిగతా 6వ పేజీలో

రిమ్స్‌పై వచ్చే నెలలో సమీక్ష నిర్వహించాలి

రిమ్స్ ఆస్పత్రిపై వచ్చేనెల మొదటివారంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధికారులను కోరారు. దాతల సహాయంతో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మోటార్లు పనిచేయకపోవడంతో మద్దిపాడు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని 50 గ్రామాలకు నీటి సరఫరాలో 17 రోజులపాటు సమస్య వచ్చిందన్నారు. ఒంగోలు నగర పరిధిలో వినియోగించకుండా ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన 146 ఎకరాలను రెవెన్యూ శాఖకు బదలాయిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీలు పడిపోయాయి

మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఓపీలు భారీగా తగ్గిపోయాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గతంలో రోజుకు 800 ఓపీలు ఉండగా ప్రస్తుతం 200కు పడిపోయాయన్నారు. రోగుల పట్ల వైద్యులు శ్రద్ధపెట్టకుండా ప్రైవేటుగా ప్రాక్టీస్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరీ వర్కర్‌ను ఏజెంట్‌గా పెట్టుకొని దివ్యాంగుల పెన్షన్ కోసం నకిలీ సర్టిఫికెట్లను మంజూరుచేస్తున్నారని మండిపడ్డారు. ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాగునీటి బోర్‌వెల్స్‌ను రిపేరు చేయాలన్నారు. పొదిలి ప్రాంతానికి వారానికి 30గంటల పాటు ఇస్తున్న నీటి సరఫరాను 48 గంటలకు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీకి సంక్రాంతి

- పండుగకు 721 ప్రత్యేక బస్సు సర్వీసులు
- ప్రకాశం రీజియన్‌కు రూ.1.69కోట్ల ఆదాయం
- అత్యధికంగా కనిగిరి డిపో నుంచే రాకపోకలు



ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది సంక్రాంతి ప్రజలకే కాదు.. ఆర్టీసీకి పెద్ద పండుగే అయ్యింది. గత ఐదేళ్లలో సరైన వనరులు లేక, కాలం చెల్లిన బస్సులతో ఎలాగోలా నెట్టుకురాగా.. ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బస్సులను తొలగించడంతోపాటు అవసరమైన డిపోలకు కొత్తవి ఏర్పాటు చేసింది. దీంతో పెద్ద పండుగకు నగరాల నుంచి వచ్చే వారంతా ఆర్టీసీ వైపే మొగ్గుచూపారు. అటు ప్రైవేటు ట్రావెల్స్‌లో చార్జీల మోతతో భయపడిన ప్రయాణికులు సాధారణ చార్జీలతోనే ఆర్టీసీలో ప్రయాణించారు. ఈ సంక్రాంతికి జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 721 ప్రత్యేక బస్సులను నడిపారు. రూ.1.69కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో జిల్లాలోని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలుతోపాటు గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, పొదిలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు

మిగతా 6వ పేజీలో

ఆక్రమణలు తొలగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దర్శి-కురిచేడు రోడ్డులో ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఎస్‌పీ స్థలాల్లో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగిస్తామని సంబంధిత శాఖల అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ఉచితం పేరుతో మాయ' అన్న శీర్షికతో ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఎస్‌పీ స్థలాల అన్యాక్రాంతంపై వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆక్రమిత స్థలాలను గుర్తించామని, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిలేడీ అరెస్టు

- వృద్ధ మహిళలే ఆమె టార్గెట్
- మత్తుమందు ఇచ్చి దోపిడీలు
- నిందితురాలిపై 11 కేసులు
- రూ.35లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్

6

నవరస భరితం నయన మనోహరం

- అలరించిన ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రదర్శనలు
- ఆకట్టుకున్న కోలాటం.. మైమరపించిన నాదస్వర కచేరి

7



కోలాటం ప్రదర్శిస్తున్న ఒంగోలు ప్రసన్నాంజనేయ బృందం



వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్

రహదారి భద్రత అందరి బాధ్యత

- మంత్రి బాలవీరాంజనేయ స్వామి
- ఒంగోలులో వాక్‌థాన్ ప్రారంభం
- పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

6

విమానాశ్రయంపై కదలిక

- ఒంగోలు వచ్చిన ఎయిర్‌పోర్టు అథారిటీ బృందం
- అల్లూరు-ఆలూరు మధ్య ప్రతిపాదిత భూముల పరిశీలన

6

వెలిగొండ కదిలింది

(5వ పేజీ తరువాయి)

అనేకచోట్ల దెబ్బతిన్నాయి. భారీ రంధ్రాలు పడి వర్షపునీరు వాటి ద్వారా బయటకు రావడం, కొన్నిచోట్ల పూడిపోవడం, చిట్టడవిని తలపించేలా ఉండటాన్ని మంత్రులు గుర్తించారు. అలాగే టన్నెల్ల పనులు కూడా లోపభూయిష్టంగా దర్శనమిచ్చాయి ఒక్కొక్కటి 18.80 కి.మీ ఉండే ఏడు మీటర్లు ఒకటి, 9.20 మీటర్లు మరొకటి రెండు టన్నెళ్ల ఉన్నాయి. తొలి టన్నెల్ తవ్వకం గత టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తికాగా రెండో దానిని కూడా రెండొంతులు తవ్వారు. తవ్వకం, లైనింగ్ ఒకేసారి టన్నెల్ బోర్ మిషన్ ద్వారా చేయాల్సి ఉండగా వైసీపీ హయాంలో మాన్యువల్‌గా చేపట్టారు. లైనింగ్ లేకుండా చేయడమే కాక తొలి, రెండో టన్నెల్‌కు మూడుచోట్ల భారీ రంధ్రాలు పెట్టారు. తవ్విన మట్టిని కూడా బయటకు కాకుండా కృష్ణానది వైపు హెడ్ రెగ్యులేటరీ సమీపంలో పోశారు. ఇలా అనేక అవకతవకలు, భవిష్యత్‌లో సమస్యలు తెచ్చే అవకాశం ఉన్న అంశాలను కూటమి మంత్రుల పరిశీలనలో గుర్తించారు.

కీలక పనులపై దృష్టి

గత ఏడాది నవంబరు రెండో వారంలో ఇలాంటి కీలక ప్రాజెక్టులపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సందర్భంగా అన్ని అంశాలు చర్చకు వచ్చాయి. వాటిపై స్పందించిన చంద్రబాబునాయుడు పనులు పూర్తికాకుండా నీరు ఇవ్వడం సరైంది కాదని గుర్తించారు. 2026 జూన్‌కు మొత్తం పనుల పూర్తి లక్ష్యంగా పెట్టుకొని నిర్దిష్ట ప్రణాళికతో పూర్తిచేయాలని ఆదేశించారు. పనులు నిర్వహించే మెగా కంపెనీ ప్రతినిధులతోనూ స్వయంగా మాట్లాడి తగు సూచనలు చేశారు. దీంతో వెలిగొండపై కదలిక వచ్చింది. కీలకమైన పెండింగ్ పనులు ముందుకు సాగాయి. ప్రధానంగా రెండో టన్నెల్‌లో లైనింగ్ పనులు డిసెంబరులో పునఃప్రారంభించారు. టీబీఎం లేకపోవడంతో గ్యాంట్రీ విధానంలో (కూలీలతో) లైనింగ్ చేస్తున్నారు. రెండు విభాగాలుగా ఈ పనులు చేపట్టగా ఒక్కో దానిలో 50 నుంచి 60 మంది కూలీలు పనులు చేస్తున్నారు. నెలకు ఒక్కో బృందం సగటున 150 మీటర్ల లైనింగ్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం రెండు విభాగాలుగా జరుగుతుండగా ఏప్రిల్ నుంచి మరో గ్యాంట్రీని కూడా ఏర్పాటు చేసి మూడింటి ద్వారా నెలకు 450మీటర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మూడు బృందాలతో సర్వే

మరోవైపు మట్టికట్టలు పోసి కాలువగా చేసిన 6 కి.మీ దూరం పనులు ఎలా చేయాలన్న దానిపై సర్వే జరుగుతోంది. గత నెలలో విజయవాడలోని ఇంజనీరింగ్ కళాశాల, అగ్రికల్చర్ ల్యాబ్‌కు చెందిన బృందాలు విడివిడిగా వచ్చి సర్వే చేసి వెళ్లాయి. ప్రస్తుతం వారంరోజులుగా హైదరాబాద్‌కు చెందిన మరో ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ బృందం మట్టి నమూనాలు తీస్తోంది. వాటిని ల్యాబ్‌లలో పరిశీలించనున్నారు. మూడింటి రిపోర్టుల ఆధారంగా ఆ కాలువల తదుపరి పనులపై ఒక నిర్ణయం తీసుకోనున్నారు. వచ్చేనెల తొలివారం నాటికి దీనిపై స్పష్టత రానుంది. ఇక అత్యంత ప్రధానమైన నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపు, కాలనీల్లో సౌకర్యాలు తదితర అంశాలపైనా ప్రభుత్వ స్థాయిలో కదలిక కనిపిస్తోంది. ముంపు గ్రామాల్లోని సుమారు ఏడున్నర వేల నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపునకు రూ.800కోట్లు, కాలనీ ఏర్పాటు సౌకర్యాలు, భూసేకరణకు మరో రూ.500 కోట్లు కలిపి రూ.1,300 కోట్లుకు 2021 ఫిబ్రవరిలో జీవో జారీ చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకపోవడంతో ఆ ప్రక్రియ అంతా నిలిచిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆ విషయంపై ప్రత్యేక దృష్టి సారించింది.

దశల వారీగా పునరావాసం

ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్న కొద్దీ దశలవారీ పునరావాస వ్యవహారాన్ని చూడాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తొలిగా కంభం ఎస్‌డీసీ పరిధిలో సుమారు రూ.80 కోట్లను ఇప్పుడు ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే బడ్జెట్‌లో ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తారని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చెప్తున్నారు. అయితే ఇంకా భారీ వెచ్చించాల్సి ఉంది. పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం దృష్ట్యా ప్రభుత్వం మాటలు కాకుండా ఆచరణలో అధిక నిధులు ఇచ్చి సత్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. ఈక్రమంలో పలు పార్టీలు, రైతు సంఘాలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడికి సిద్ధమవుతున్నాయి. ఇదే అంశంపై గురువారం కనిగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేయగా పార్టీ అగ్రనేత బీవీ రాఘవులు హాజరవుతున్నారు.

ఆర్టీసీకి సం'క్రాంతి'!

(5వ పేజీ తరువాయి)

నడపగా, అత్యధికంగా కనిగిరి డిపో నుంచే తిరిగాయి. వచ్చిన ఆదాయంలో అత్యధికంగా కనిగిరి డిపో నుంచే రావడం విశేషం. మొత్తంగా ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నా ఆర్టీసీకి ఈ సంక్రాంతి ఆదాయ వనరులు పెంచింది.

60 వేల మంది ప్రయాణికులు..

ఈ ఏడాది సంక్రాంతికి సుమారు 60వేల మంది జిల్లాలోని తమ సొంతూర్లకు వచ్చి తిరిగి వెళ్లారు. జిల్లాకేంద్రమైన ఒంగోలు నుంచి 168 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయగా 9,756 మంది ప్రయాణించారు. కనిగిరి డిపో నుంచి 253 ప్రత్యేక బస్సులు నడపగా 27,737 మంది రాకపోకలు సాగించారు. మార్కాపురం డిపో నుంచి 122 బస్సులలో 9,013 మంది, పొదిలి నుంచి 108 బస్సులలో 9,692 మంది, గిద్దలూరు నుంచి 70 బస్సులలో 2,908మంది ప్రయాణించారు. కనిగిరి, ఒంగోలు, మార్కాపురం డిపోల నుంచి అధికంగా ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా మొత్తం 721 ప్రత్యేక బస్సులు 4,68,534 కి.మీ రాకపోకలు సాగించగా రూ.1,69,30,555 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. గతేడాది సంక్రాంతికి 504 బస్సులు 3,40,601 కి.మీ నడపగా, రూ.1,23,97,820 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ప్రయాణికులకు కృతజ్ఞతలు

సంక్రాంతి పండుగకు ఆర్టీసీలో ప్రయాణించి ఆదాయవనరులు పెంచిన ప్రయాణికులకు జిల్లా రీజియన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ప్రైవేటు ట్రావెల్స్‌ను కాదని సురక్షితమైన ప్రయాణం ఆర్టీసీతోనే అని నమ్మిన ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేసిన సిబ్బందిని అభినందిస్తున్నాం. సాధారణ చార్జీలతోనే రీజియన్‌లో రూ.1.69 ఆదాయం రావడం సంతోషంగా ఉంది. అందుకోసం ముందుగా ప్రయాణికులతోపాటు, ఆయా డిపో మేనేజర్లు, ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, కార్మికులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. సమష్టి కృషితో ఇలాగే భవిష్యత్‌లో ఆర్టీసీని అన్నివిధాలా అభివృద్ధి చేసే దిశగా ముందుకెళతాం.

- మురళీబాబు, ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆర్ఎం

వృద్ధ మహిళలే టార్గెట్!

- మత్తుమందు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్న కిలాడీ లేడీ అరెస్ట్
- నిందితురాలిపై 11 కేసులు
- రూ.35లక్షల విలువైన బంగారపు సొత్తు స్వాధీనం
- ఎస్పీ దామోదర్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉంటున్న వృద్ధ మహిళలే ఆమె టార్గెట్. మాయ మాటలు చెబుతూ శీతలపానియాల్లో మత్తు మందు కలిపి ఇచ్చి తరువాత దోపిడీలకు పాల్పడటం ఆమె నైజం. అయితే ఈ కేసుల్లో కిలాడీ లేడీ ఇచ్చిన మత్తు మందు కారణంగా ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. మరో రెండు కేసుల్లో బంగారపు దుకాణాల్లో పట్టపగలు చోరీలకు పాల్పడింది. ఒంగోలులో నివాసం ఉంటూ ఏడాది కాలంగా ఎవరి కంటా పడకుండా పట్టపగలు గుట్టుగా దొంగతనాలకు పాల్పడుతోంది. ఈమేరకు దృష్టి సారించిన ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేక బృందాన్ని నియమించి ఆమె ఆట కట్టించారు. నిందితురాలిపై మొత్తం 11 కేసులు నమోదు చేశారు. ఇందులో 9 కేసులు మత్తు మందు ఇచ్చి చోరీలకు పాల్పడినవి కావడం గమనార్హం. ఈమేరకు బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో ఎస్పీ దామోదర్ వివరాలను వెల్లడించారు.

460 గ్రాముల బంగారం స్వాధీనం

ఒంగోలు రూరల్ మండలం దేవరంపాడుకు చెందిన గంటా ఎలీశమ్మ అలియాస్ గంధం సుజాత ప్రస్తుతం ఒంగోలు నగరం బాలాజీనగర్‌లో నివాసం ఉంటుంది. ఈక్రమంలో ఆమెను బుధవారం ఉదయం స్థానిక బాలాజీనగర్‌లో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య నేతృత్వంలో టంగుటూరు పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి 460 గ్రాములు బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.35 లక్షలు.

గతంలో జైలుకు వెళ్లి వచ్చి..

నిందితురాలు సుజాత 2013లో ఓ దొంగతనం కేసులో విజయవాడలో అరెస్టు అయ్యి జైలుకు వెళ్లింది. అప్పటి నుంచి టీవీ సీరియల్స్‌కు ఆకర్షితురాలై వాటిని చూసి నిద్రమాత్రలు ఇచ్చి దొంగతనం చేయవచ్చని తెలుసుకుంది. దీనికితోడు ఆమెకు ఉండే అనారోగ్య కారణాలకు నిద్రమాత్రలు వాడుకుంటుంది. అవే మాత్రలను వృద్ధురాళ్ల ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పి శీతలపానియాల్లో కలిపి ఇచ్చి వారి వద్ద ఉన్న బంగారం అపహరించుకుని వెళుతోంది. ఏడాదిగా టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు తాలుకా, వన్‌టౌన్, టూటౌన్, నాగులుప్పలపాడు, కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 కేసుల్లో మత్తు మందు ఇచ్చి దొంగతనాలు, రెండు బంగారపు షాపుల్లో చోరీలకు పాల్పడింది.

ఇద్దరు వృద్ధ మహిళల మృతి

మాయలేడీ మత్తు మందు ఇచ్చి దోపిడీలకు పాల్పడిన ఘటనలలో ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. త్రోవగుంటలో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుండగా ఆమెకు శీతలపానియంలో మత్తు మందు ఇచ్చి నిద్రలోకి జారుకున్న తరువాత బంగారపు ఆభరణాలు చోరీ చేసింది. అనంతరం ఆ వృద్ధురాలు మృతి చెందింది. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్ సమీపంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలికి మామిడికాయలో మత్తు వేసి తినిపించి ఆమె వద్ద ఉన్న బంగారపు నగలు అపహరించుకెళ్లింది. ఆ వృద్ధురాలు రెండు రోజుల అనంతరం మృతి చెందింది. ఆమె మృతికి కారణం మత్తుమాత్రలు అని డాక్టర్లు నివేదిక ఇచ్చారు.

పోలీసులకు రివార్డులు

వృద్ధులే లక్ష్యంగా జరుగుతున్న చోరీల కేసుల్లో నిందితురాలిని పట్టుకున్న ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐలు వి.నాగమల్లేశ్వరరావు, బి.మహేంద్ర, ఏఎస్ఐ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, తిరుపతిస్వామి, ఎస్.వెంకటరావు, డి.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఎస్‌కే.ఖాదర్‌వలి, ఎన్.నాగర్జున, మహిళా కానిస్టేబుళ్లు పి.శివకుమారి, బి.ప్రసన్నకుమారిలను ఎస్పీ దామోదర్ అభినందించి రివార్డులు అందజేశారు.

అక్కినేని అవార్డు ఆనందదాయకం



మాట్లాడుతున్న వందేమాతరం శ్రీనివాస్



వందేమాతరం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

- కళాకారుడిగా ఒంగోలు జన్మనిచ్చిన తల్లి
- అన్న రుణం తీర్చుకోలేనిది
- గాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్

ఒంగోలు కల్చరల్ , జనవరి22(ఆంధ్రజ్యోతి) : తెలుగు చిత్రసీమకు రెండు కళ్లు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు అని, అటువంటి వ్యక్తి పేరిట అవార్డు తీసుకోవటం తనకెంతో ఆనందంగా ఉందని ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు అక్కినేని కళాపరిషత్ తరపున అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం 2025ను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు తనకు ఒక కళాకారుడిగా జన్మనిచ్చిన తల్లి అని, ఎక్కడో మారుమూల ఉన్న తనని చేరదీసి పెంచి పెద్దచేసిన అన్న నల్లూరి వెంకటేశ్వర్లు రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వందేమాతరం శ్రీనివాస్ చిన్నతనం నుంచే మంచి గాయకుడని, అతను ఎంతో కష్టపడి తనకంటూ చిత్రసీమలో ఒక స్థానాన్ని పొందటం తనకే కాకుండా జిల్లాకు కూడా ఎంతో గర్వకారణమని అన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వందేమాతరం శ్రీనివాస్ పాటలు తనకెంతో ఇష్టమని, అటువంటి వ్యక్తికి అవార్డు సభలో పాల్గొనటం ఆనందంగా ఉందని అన్నారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు ప్రసంగిస్తూ ఒంగోలు కళలకు, కళాకారులకు పుట్టినిల్లని అటువంటి ఒంగోలు గడ్డమీద చదివి నేడు తెలుగుచిత్ర సీమలో ప్రముఖ స్థానాన్ని పొందిన వ్యక్తి వందేమాతరం శ్రీనివాస్ అని అన్నారు. కార్యక్రమానికి అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య అధ్యక్షత వహించగా ప్రముఖ పారిశ్రామిక వేత్త మండవ మురళీకృష్ణ మరొక అతిథిగా పాల్గొని వందేమాతరం శ్రీనివాస్‌ను అభినందించారు.

కార్యక్రమానికి పొన్నూరి వెంకట శ్రీనివాసులు వ్యాఖ్యాతగా వ్యవహరించగా విజయ్, పూర్ణిమ బృందం ఆలపించిన అక్కినేని నాగేశ్వరరావు చిత్రాలలోని పలు గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. 'పెళ్లెప్పుడౌతుంది బాబూ' అంటూ వందేమాతరం శ్రీనివాస్ తన పాటతో ప్రేక్షకులను సమ్మోహన పరిచారు.

పట్టపగలు చోరీ

నిలిపి ఉన్న కారు అద్దం పగులగొట్టి నగదు, ల్యాప్‌ట్యాప్ చోరీ

మార్టురు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో బుధవారం పట్ట పగలు దొంగలు సినీ పక్కీలో చోరీకి పాల్పడ్డారు. నిలిపి ఉన్న కా రు అద్దం పగులగొట్టి అందు లో ఉన్న రూ.1.20లక్షల నగదు, ల్యాప్‌టాప్, పలు పత్రాలను చోరీ చేశారు. బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి మాలపాటి పోతురాజు బుధవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న సర్వీసు రోడ్డులో కారును నిలిపి ఎదురుగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకి వెళ్లి వచ్చే సరికి కారు ముందు భాగంలో ఉన్న ఎడమ వైపు అద్దాన్ని పగులగొట్టి కింద ఉన్న బ్యాగులో నగదును, ల్యాప్ ట్యాప్‌ను, చెక్కు బుక్‌తోపాటు విలువైన డాక్యుమెంట్లను దొంగిలించారు. పట్ట పగలు ప్రజలు తిరిగే సర్వీసు రోడ్డులో కారు అద్దం పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వెంటనే వైద్య శాల లోపలి నుంచి వచ్చిన వ్యాపారి పోతురాజు కారు అద్దం పగిలి ఉండటం చూసి వెంటనే లోపల ఉన్న బ్యాగు కోసం చూడగా చోరీ జరిగిందని గ్రహించి వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఇన్‌చార్జి సీఐ వెంకట్రావు చోరీ జరిగిన కారును పరిశీలించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలి ముద్రలను పరిశీలించారు. పోతురాజు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మహబూబ్‌బాషా కేసు నమోదు చేశారు.

చేపల పెంపకం శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాదంపూడిలోని దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణ కేంద్రంలో 135వ బృందంలో చేపల పెంపకంపై శిక్షణ పొందటానికి అభ్యర్థులు వచ్చేనెల 19లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు కోరారు. ఐదో తరగతిపైన చదివి, 18-30 మధ్య వయస్సున్న కోస్తా జిల్లాల్లోని అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను శిక్షణ కేంద్రానికి పంపాలని సూచించారు. ఉపకార వేతనం లేకుండా 20 సీట్లున్నాయని చెప్పారు. వచ్చే నెల 20న ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన వారు శిక్షణలో ఉత్తీర్ణులైతే సర్టిఫికెట్లు జారీ చేస్తామని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

26న రాష్ట్రస్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94903 36550ను సంప్రదించాలన్నారు.

విమానాశ్రయం ఏర్పాటుపై కదలిక



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

- భూములను పరిశీలించిన ఎయిర్‌పోర్టు అథారిటీ సెంట్రల్ టీం
- అధికారులతో చర్చించిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్

కొత్తపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎయిర్ పోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగవంతమవుతోంది. ఎయిర్‌పోర్టు అథారిటీ అఫ్ ఇండియా సెంట్రల్ అధికారుల బృందం బుధవారం విమానాశ్రయం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించింది. కొత్తపట్నం మండలం అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్య ఉన్న ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అధికారులు ఎఎస్ఎన్ మూర్తి, పర్విన్ తివారి, అమన్, అరుణ్ కుమార్, షాజ్ అబుల్, నబీల్ రోషన్ ఉన్నారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కొత్తపట్నం తాహసీల్దార్ మధుసూదనరావు భూముల వివరాలను సెంట్రల్ బృందానికి వివరించారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ కూడా భూములను పరిశీలించి అనంతరం ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులతో మాట్లాడారు. ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం సేకరించిన 550 ఎకరాలకు సంబంధించిన చిత్రపటాలను వారు పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఒంగోలులో ఏర్పాటుకు స్థలం సిద్ధంగా ఉందని అధికారులకు తెలిపారు. 2006 నుంచి విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్, ఆక్వా రంగం అభివృద్ధి చెందిందన్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేయటం వల్ల ఆయా రంగాల అభివృద్ధి మరింతగా ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని ఎయిర్ పోర్టు అధికారులకు తెలిపారు.



హెల్మెట్ చూపుతున్న మంత్రి డోలా, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియా

రహదారి భద్రత అందరి బాధ్యత

- మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి
- ర్యాలీలో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలుక్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నియమాలు పాటించడం అందరి బాధ్యత అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హితవు పలికారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కాలేజీ విద్యార్థులతో వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. దీన్ని మంత్రి బాలవీరాంజనేయస్వామి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల పాల్గొన్నారు. అనంతరం అద్దంకి బస్టాండ్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్లపై గుంతలను ప్రభుత్వం పూడ్చించిన విషయాన్ని గుర్తుచేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్పించిన వారికి కేంద్రప్రభుత్వం పారితోషికం అందజేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హితవు పలికారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రహదారి భద్రత వారోత్సవాలు ఈనెల 15 నుంచి వచ్చేనెల 16 వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కన్న కలలను సాకారం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అందుకోసం రహదారి భద్రత నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

(5వ పేజీ తరువాయి)

లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగర్ జలాలు మరోసారి విడుదల చేయనున్నారని, వాటితో చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్వామి ఆదేశించారు.

భవన నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్ నిధులు

వివిధ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులను తన ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయిస్తానని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మాగుంట ప్రస్తావించారు.

గైనకాలజిస్ట్ విధులు నిర్వహించడం లేదు

పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కనిగిరికి డిప్యుటేషన్‌పై వచ్చిన గైనకాలజిస్ట్ విధులు నిర్వర్తించడం లేదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. పామూరుకు కూడా తిరిగి రాలేదన్నారు. చెప్పకుండా విధులకు గైర్హాజరైన గైనకాలజిస్ట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏరియా ఆస్పత్రికి వైద్యులను నియమించాలి

గిద్దలూరులోని ఏరియా ఆస్పత్రిలో రేడియాలజిస్టు, పిడియాట్రిషియన్, అనస్తీషియా వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. ఆస్పత్రిలో ఉన్న నియోనాటల్ కేర్ యూనిట్‌ను స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కంభం ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో 500 అడుగుల కంటే లోతులో ఉన్న బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకొని అన్నింటికి మరమ్మతులు చేయాలని కోరారు.

మదర్ బ్లడ్‌బ్యాంకును జిల్లాలోనే అనుసంధానం చేయాలి

గతంలో దర్శిలోని ప్రభుత్వ వైద్యశాలకు మదర్ బ్లడ్‌బ్యాంకుగా చీరాల ఉండేదని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కొత్త జిల్లా ఏర్పడినందున మదర్ బ్లడ్‌బ్యాంకును కూడా ప్రస్తుత జిల్లాలోనే అనుసంధానం చేసే విధంగా చూడాలన్నారు. దర్శి ఆస్పత్రికి తాత్కాలిక మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఎస్‌పీ ప్రాజెక్టులోని ఫిల్టర్‌బెడ్లు దెబ్బతిన్నాయని, వాటిని మార్చాలని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

వేసవిలో వైపాలెం నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుందని, అందువల్ల ట్యాంకర్ల ద్వారా సరఫరాకు చర్యలు తీసుకోవాలని వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. దోర్నాలలోని గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధులు మంజూరుచేసి నిర్మాణం త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైపాలెం ప్రభుత్వ వైద్యశాలలో క్యాత్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు దాతలు సుముఖంగా ఉన్నారని, అందుకు అవసరమైన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల మరమ్మతులతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో అధికారులు లక్ష్మానాయక్, అర్జున్‌నాయక్, జయ, అర్చన, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, వరలక్ష్మి, బాలమురళీమోహన్, బాలకశంకరరావు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున పాల్గొన్నారు.



వినసొంపైన నాదస్వరం శ్రోతలను మైమరిపించింది.
జనపదాలకు లయబద్ధంగా కాలు కదుపుతూ సాగిన మహిళల కోలాట ప్రదర్శన కనువిందు చేసింది.
వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ ప్రదర్శించిన నాటికలు వీక్షకులను ఆలోచింపజేశాయి.
ఇలా వివిధ రకాల కళలతో ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలు నవరస భరితంగా ప్రేక్షకులకు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విభిన్న రంగాల కళాకారులు కార్యక్రమాల్లో పాల్గొంటూ వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. - ఒంగోలు కల్చరల్, ఆంధ్రజ్యోతి

నవరస భరితం నయన మనోహరం

అలరించిన ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రదర్శనలు

అలరించిన కోలాటం

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఒంగోలు బృందావన నగర్‌కు చెందిన ప్రసన్న ఆంజనేయ కోలాట బృందం మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. గణపతి ప్రార్థనా గీతంతో ప్రారంభమైన కోలాటంలో అన్నమాచార్య కీర్తనలు, జానపద గీతాలు, పల్లెపాటలకు మహిళలు తాళ లయబద్ధంగా కదులుతూ చక్కటి కోలాటాన్ని ప్రదర్శించారు. సుమారు 50 మంది మహిళలు పాల్గొన్న ఈ కోలాట కార్యక్రమాన్ని బండారు బ్రహ్మయ్య నిర్వహించగా, శిక్షకురాలు అశ్వినీకుమారి పర్యవేక్షించారు.



శ్రవణానందం నాదస్వరం

కళా పరిషత్ ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం దేవరపాలెం గ్రామానికి చెందిన దేవకుమార్ బృందం నాదస్వర కచ్చేరి శ్రవణానందకరంగా కొనసాగింది. వివిధ శాస్త్రీయ గీతాలను వారు రసరమ్యభరితంగా వినిపించారు.



రాతకు కారణమెవ్వరు?

మనిషి రాతకు కారణం ఎవ్వరు? మనిషి తన పరిస్థితి బాగోలేకపోతే రాత బాగాలేదు అంటాడు. అదే పరిస్థితులు తనకు అనుకూలంగా మారినప్పుడు దాని గురించి ఆలోచించడు. తాను సమాజం నుంచి కానీ, ప్రకృతి నుంచి కానీ పొందాల్సినవి ఆశిస్తాడు కానీ తను ఇవ్వాల్సిన వాటి గురించి ఆలోచించడు. ఇటువంటి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఏం జరుగుతుంది? ఈ అనర్థాలకు కారణం ఎవ్వరు? ఇది ఎవరు రాసిన రాత అనే చక్కటి కథాంశంతో వెలగలేరు ఆర్ట్ థియేటర్స్ వారు ప్రదర్శించిన 'రాత' నాటిక ఆలోచింపజేసేదిగా కొనసాగింది. పోలుదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించిన ఈ నాటికలో నటీనటులు తమ పాత్రలకు తగిన విధంగా నటించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు.

నిజాయితీదే పైచేయి

అవినీతి మార్గంలో, అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలని ఆరాటపడేవారి సంఖ్య ప్రస్తుత సమాజంలో ఎక్కువగా ఉంది. అలా సంపాదించిన వాడిని ప్రశ్నించేవారు ఎవ్వరూ ఉండరు. అయితే డబ్బు అనేది ఇవాళ ఉంటుంది రేపు పోతుంది. కానీ నిజాయితీకి ఎప్పుడూ సమాజంలో విలువ ఉంటుంది. తోటి వారిని మోసం చేసి డబ్బు సంపాదించాలనుకునే ఒక యువకుడి ప్రయత్నం ఎలా విఫలమైంది? చివరకు నిజాయితీకి ఉన్న విలువ అతను ఎలా తెలుసుకోగలిగాడు? అనే కథాంశంతో యువతకు చక్కటి సందేశాత్మకంగా కొనసాగిన నాటిక 'గురితప్పిన వేట'. ఎన్టీఆర్ కళాపరిషత్ వేదికపై బుధవారం రాత్రి రెండవ ప్రదర్శనగా ప్రదర్శితమయిన ఈ నాటికను పొన్నూరు రసఝరి సంస్థ కళాకారులు ప్రదర్శించగా విన్నమనేని మృత్యుంజయరావు రచన, వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు. గురువారం రాత్రి గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక, కర్నాటక బంగారుపేటకు చెందిన భారత కళా గ్రామ నాట్య గురుకులమ్ వారిచే పాండు రంగం భజే నృత్యరూపకం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





పరీక్ష క్రేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

సజావుగా జేఈఈ మెయిన్స్ పరీక్ష

ఒంగోలు విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థలు ఐఐటీ, ఎన్ఐటీల్లో 2025-26 విద్యాసంవత్సరంలో బీటెక్ ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు బుధవారం ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్ష సజావుగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్ష జరిగింది. ఒంగోలులోని క్విస్, రైజ్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలలు, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఎన్‌సీసీఎస్ఏఐ సంస్థల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం సెషన్ పరీక్షకు హాజరయ్యేందుకు ఉదయం 7 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఒంగోలులోని అన్ని పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు 900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షలను దేశవ్యాప్తంగా నిర్వహించింది.



ఒంగోలులో జాతీయ రహదారి పక్కనున్న నేషనల్ కౌన్సెలింగ్ ఆఫ్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా కళాశాలలో జేఈఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు



పరీక్షకు పరుగో.. పరుగు..



శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డోలా, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

బడుగు విద్యార్థులకు మెరుగైన వసతి

● మంత్రి డోలా బాలశ్రీవీరాంజనేయస్వామి ● వసతిగృహాల నిర్మాణానికి శంకుస్థాపన

ఒంగోలు నగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలు ఉంటున్న సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించేదిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం ఆయన ఒంగోలులో రూ.6.15 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో బాగంగానే వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు చదువు సక్రమంగా సాగేందుకు వసతిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఒంగోలులో రూ.30 కోట్ల వ్యయంతో వసతి గృహాలకు నూతన భవనాలను ని ర్మిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.143 కోట్లతో వసతి గృహాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. ఒంగోలులో బాలురకు కూడా వసతి గృహాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం నగరంలో తూర్పుపాలెంలో ఉన్న స్థలాన్ని పాఠశాలకు దగ్గరలోకి మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. వసతిగృహ విద్యార్థుల భద్రత, వసతి గృహాల ఆవరణలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రం మొత్తం మీద వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఈ వసతి గృహంలో 600 మంది విద్యార్థినులకు వసతి కల్పించే అవకాశం ఉందన్నారు. ఏడాదిలోగానే భవన నిర్మాణం పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం, వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించటంపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాలికలు విద్యారంగంలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాజ, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏపీఈ డబ్ల్యుఐడీసీ ఈఈ భాస్కరరాబు పాల్గొన్నారు.

రేపు సుకన్య సమృద్ధి యోజన

పోస్టల్ ఖాతాల మేళా

సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని తపాలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 సంవత్సరాలు వయస్సులోపు బాలికలకు బ్యాంకు ఖాతాలను తెరిచేందుకు అవకాశం కల్పించినట్లు పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన అకౌంట్ పేరుతో ఈనెల 24వ తేదీన ఖాతాల మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.250లతో బ్యాంకు ఖాతాను అందిస్తామని, ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు జమ చేయవచ్చని తెలిపారు. ఖాతా ప్రారంభం అయినప్పటి నుంచి 14 సంవత్సరాల పాటు నగదు జమచేయవచ్చని, ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు ఉంటుందని వివరించారు. బాలికకు 18 వయస్సు నిండిన తర్వాత ఉన్నత విద్య కోసం గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉన్న మొత్తంలో 50శాతం విత్‌డ్రా చేసుకోవచ్చని, లేనిపక్షంలో వివాహం నిమిత్తం అయితే నెల రోజుల ముందు ఖాతాను మూసివేసి, జమ చేసిన మొత్తాన్ని తీసుకోవచ్చని తెలిపారు. పోస్టల్ ఖాతా ఓపెన్ చేయడానికి బాలిక జనన ధృవీకరణ పత్రం, బాలిక, ఆమె సంరక్షకుని ఒకొక్కరివి 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, చిరునామా ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు. జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ ఖాతా మేళా సేవలు అందుబాటులో ఉంటాయని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అసోసియేషన్ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. జిల్లాలో తహసీల్దార్లతో పాటు ఇతర ఉద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో కోశాధికారి ఊతకొలు శ్రీనివాసులు, రాజేష్, సాయి శ్రీనివాస్, కిషోర్‌కుమార్‌రెడ్డి, పి.రాము, ప్రశాంత్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న నూతన కార్యవర్గం

నేడు విద్యాశాఖ జోనల్ స్థాయి వర్క్‌షాపు

ఒంగోలు విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్య బలోపేతంపై గురువారం ఒంగోలులోని ఏఎస్ ఫంక్షన్‌హాలులో ప్రకాశం, నెల్లూరు జిల్లాల జోనల్ స్థాయి వర్క్ షాపు జరుగనుంది. విద్యాశాఖ 117 జీవో రద్దు అనంతర పరిణామాలు, చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చిస్తారు. పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, ఐసీడీఎస్ పీడీలు, ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్జేడీ, డీఈవోలు, ఉప విద్యాధికారులు, ఎంఈవోలు, కొత్త క్లస్టర్ స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హాజరవుతారు. ఈ వర్క్‌షాపు ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

● కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు ● బాలికలతో కలిసి సైకిల్ తొక్కి ఉత్సాహపరిచిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అభివృద్ధి చెందినప్పుడు కుటుంబ వ్యవస్థ తద్వారా నవ సమాజం అభివృద్ధి చెందుతుందని, బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో సైకిల్ ర్యాలీని కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిష్పత్తి తగ్గించి బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు చొరవ తీసుకుంటున్నాయని, ప్రజలు కూడా సంపూర్ణ సహకారం అందించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా సహకరించాలన్నారు. బాలికలతో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా సైకిల్ తొక్కారు. చిన్నారుల కేరింతల మధ్యలో కలెక్టర్ సైకిల్ తొక్కడం ఉత్సాహ పర్చింది. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్, బాల్య వివాహ రహిత ప్రకాశం జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన్న ఓబులేషు, ఐసీడీఎస్ పీడీ సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సీడీపీవోలు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

విజేతలకు మంత్రి అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు అభినందించారు. కొండపిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఎ.కావ్య, లక్ష్మి ప్రణతిలు మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్‌లో బంగారు పతకాలు సాధించారు. అంతేగాకుండా వారు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మంత్రి స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఎన్.అగ్రహారం జగనన్న కాలనీలో
లబ్ధిదారుల పరిశీలన పూర్తి : ఆర్డీవో

ఒంగోలు(రూరల్), జనవరి(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం ఎన్.అగ్రహారం వద్ద గల జగనన్న కాలనీలో నివేశనస్థలాలకు అర్జీలు పెట్టుకున్న లబ్ధిదారుల వివరాల పరిశీలనను వీఆర్వోలు పూర్తి చేసినట్లు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల, నగర వీఆర్వోలతో కలిసి ఆర్డీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఎన్.అగ్రహారం వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న వారి వివరాలను పూర్తిగా సేకరించామని చెప్పారు. అలాగే లబ్ధిదారుల విద్యుత్ మీటర్ ఆధారంగా పరిశీలన చేయడంతో పాటు పక్కాభవనం అనేది స్పష్టంగా నివేదికలో పొందుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. చెరువుకట్టలు, పోతురాజుకాలువ కట్ట మీద, రోడ్డు ఆక్రమణ ప్రదేశాలలో వారి ఇళ్లు ఉంటే ఆ వివరాలను అందులో నమోదు చేయాలని చెప్పారు. ఇక్కడి జగనన్న కాలనీలో సుమారుగా 22వేలమందికి నివేశన స్థలాలు ఇవ్వాల్సి ఉందని, ఇప్పటి వరకు 3వేల మంది అర్జీదారులను మాత్రమే పరిశీలన పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీలు అశోక్, శీలం శ్రీనివాసరావు, సర్వేయర్లు నాళం వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మహిళా మార్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

● వెలుగు పీడీ రవికుమార్ ఆదేశం

కొండపి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొండపిలో మహిళా మార్టు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వెలుగు పీడీ టి.రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను డ్వాక్రా మహిళలకు వివరించి వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు. రుణాల రికవరీ వందశాతం ఉండేలా పనిచేయాలన్నారు. సమావేశంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ కత్తి కల్యాణ్, ఏపీఎం బి.గోపీనాథ్, సీసీలు మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, కె.రామాంజనేయులు, అకౌంటెంట్ జి.కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

కొండపి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. బుధవారం వారు నెన్నూరుపాడు, గుర్రప్పడియ గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు దుర్వాసన వెదజల్లుతున్న మురికి కాలువలను చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీపీఎం నాయకులు కేజీ మస్తాన్, నెరసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఒంగోలులో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి కె.వెంకటేశ్వర్లును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాల నుంచి పని చేస్తున్న మీటర్‌రీడర్స్ పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలపై ఎస్ఈ వెంకటేశ్వర్లు స్పందిస్తూ, మీటర్ రీడర్స్‌కు ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించని కాంట్రాక్టర్ల యూనియన్‌తో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు, కె.సిద్ధయ్య, నాగార్జునరెడ్డి, దత్తు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

జీవాలకు నట్టల నివారణ మందు తాగించాలి

● ఏడీఏ బసవశంకరరావు

ఒంగోలు(రూరల్), జనవరి22(ఆంధ్రజ్యోతి): గొర్రెల, మేకలకు పెంపకందారులు తప్పనిసరిగా నట్టల నివారణమందు తాపించాలని త్రోవగుంట పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ జి.బసవశంకరరావు కోరారు. ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందు తాగించాలన్నారు. అదేవిధంగా పశువులు ఎదకు వచ్చినప్పడు పశువైద్యశాలలో మాత్రమే గర్భం ధరంచే సూదులు వేయించాలని చెప్పారు. లేగదూడలకు కూడా నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారులు వై.భూపాల్, ఐ.ప్రతిమ, సిబ్బంది పాల్గొన్నారు



దేవరంపాడులో నట్టల నివారణ మందును తాపిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు: మండలంలోని ఎం.వేములపాడు, గుర్వారెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం 1803 పశువులకు, జీవాలకు వైద్యసేవలు అందించినట్లు పశువైద్యాధికారులు చిరంజీవి, ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నట్టలనివారణ మందును తాగించినట్లు పేర్కొన్నారు.

నాగులుప్పలపాడు: మద్దిరాలపాడులోని పశు వైద్యశాల వద్ద ఉచిత పశు వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జేడీఏ బేబీరాణి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్యశిబిరాల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు పశుపోషకులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

● డీపీఎం సుభాషిణి

టంగుటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం వలన భూమి నిస్సారమవుతుందని డీపీఎం సుభాషిణి అన్నారు. అందువలన రైతులు వాటిని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. మండలంలోని ఎం.నిడమలూరు, పొందూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో స్వర్ణలత, కె.సుభాషిణి, ఎంపీఈవో ఎ.వేణుమణి, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొందూరులో శనగ పైరును పరిశీలిస్తున్న డీపీఎం సుభాషిణి



తొర్రగుడిపాడులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొండపి మండలంలో..

కొండపి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గుర్రప్పడియ, నెన్నూరుపాడు గ్రామాల్లో ఏవో విజయ్‌కుమార్ పర్యటించారు. కార్యక్రమం లో వీపీఏలు జ్యోష్న, వెంకట్రావు పాల్గొన్నారు.

తొర్రగుడిపాడులో..

చీమకుర్తి: మండలంలోని తొర్రగుడిపాడులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో భాస్కర్, టెక్నికల్ ఏవో కాంచన, రైతులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలోని శనగపంటను వేసిన రైతులకు సస్యరక్షణపై తీసుకోవాలని ఏవో పావని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రుద్రవరం, గుర్వారెడ్డిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

వైద్యశిబిరానికి స్పందన

సంతనూతలపాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఏఆర్‌సీ ఫెర్టిలిటీ సెంటర్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎస్ఐ వి.అజయ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కొండారెడ్డి, రాధిక వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. రోగులకు ట్రస్టు ఫౌండర్ పాతూరి సంపత్, చైర్మన్ వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. పీఎస్ఎస్.చౌదరి, హసీనా బేగం, కె.వెంకటేశ్వర్లు, పోలిశెట్టి, సుబ్బయ్య, మల్లారెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నాగులుప్పలపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో క్విస్ విద్యార్థులు

ఒంగోలు విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఒంగోలులో నిర్వహించిన వాకథాన్‌లో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. విద్యార్థులు రహదారి భద్రత పాటించాలని ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీగాయత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్చరల్ డీన్ నవనీత కృష్ణన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నగర అభివృద్ధికి పాలకులు చేసిన వాగ్దాలను అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం నగరంలోని సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, లేనిపక్షంలో సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన శెగ్గం శ్రీనివాసరావును పలువురు ఆ పార్టీ నాయకులు అభినందించారు. ఒంగోలులోను ఆయనను కలిసిన ఎస్సీ మెర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెముల మోజి, నాయకులు వీరభద్రాచారి కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

కొత్త ఓటర్లకు కార్డులు ఇవ్వాలి

మద్దిపాడు, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఓటు కోసం నమోదు చేసుకున్న వారికి ఓటర్‌కార్డు అందించాలని తహసీల్దార్ సుజన్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని తన కార్యాలయంలో బీఎల్‌వోతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి బీఎల్‌వో పోలింగ్ బూత్‌లో ఓటర్లతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాలన్నారు. మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించ నున్నట్లు ఆయన తెలిపారు.

పోతవరంలో రీసర్వే పనుల ప్రారంభం

నాగులుప్పలపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండలంలో ఎంపిక చేసిన పోతవరం గ్రామంలో రీసర్వే పనులను బుధవారం చేపట్టారు. వీఆర్వో రాణి, సచివాలయ సర్వేయర్ మౌనిక ఆధ్వర్యంలో ఐదు రీసర్వే బృందాలు గ్రామంలో భూములను సర్వే చేపట్టారు.

26న ఏఐవైఎఫ్ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఈనెల 26వతేదీన జరగనున్న అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మహాసభలో యువత పాల్గొని విజయవంతం చేయాలని ఆమర కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజియాదవ్, సుబ్బారావు, అశోక్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



గోళ్లవిడిపి నుంచి అయ్యంబొట్లపల్లి వరకు జరుగుతున్న పనులు

వేగంగా జలజీవన్ మిషన్ పనులు

● రెండు నెలల్లో ఇంటింటికీ సాగర్ జలాలు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ నీటి కొళాయిలు కనెక్షన్ ఇచ్చేందుకు అవసరమైన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఎర్రగొండపాలెం మండలంలో 2, త్రిపురాంతకం 3, పుల్లలచెరువు 5, దోర్నాల 8, పెద్దారవీడు 4 గ్రామాలకు సంబంధించి పనులు రెండు నెలలో పూర్తి చేసి సాగర్ నీరు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు మండలాల జేఈలతో సమావేశాలు నిర్వహించి రానున్న రోజుల్లో గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు పూర్తిగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్యాడులు, పెన్నుల పంపిణీ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్టీ)లో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి పదో తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడులు, పెన్నులను బహూకరించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో పి. ఆంజనేయులు హాజరై 83 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో- 2 మల్లు నాయక్, హెచ్‌ఎం పిచ్చారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

రాచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు చిన్ని సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎస్సై కోటేశ్వరరావు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ముండల విద్యాశాఖాధికారులు కోటేశ్వరరావు, గిరిధరశర్మ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామానాయక్, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు ఎం.శ్రీకాంత్, విద్యాకమిటీ చైర్మన్ జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

గిద్దలూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, 2వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టిఫిన్ తిని సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఇబ్బందికి సూచించారు.



దేవరాజుగట్టులో విచారణ చేస్తున్న వైద్య బృందం

దొంగ సర్టిఫి‘కేట్లు’

పింఛన్ల కోసం పక్కదారులు

వైసీపీ హయాంలో దొడ్డిదారిలో సామాజిక భద్రత

విచారణలో వెల్లడవుతున్న నిజాలు

పెద్దారవీడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దొంగ సర్టిఫికెట్లతో సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్న వారి వివరాలు విచారణలో బయటపడుతున్నాయి. సామాజిక భద్రత పింఛన్లలో భాగంగా ఆరోగ్య పరమైన అంశానికి సంబంధించి అనర్హులు పొందుతున్నారన్న విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా పెద్దారవీడు మండలంలో బుధవారం విచారణ ప్రారంభమైంది. ముగ్గురు వైద్యులతో కూడిన బృందం పింఛన్ల మంజూరుకు సంబంధించి ఆరోగ్యపరమైన అన్నీ అంశాలను సునిశితంగా పరిశీలన చేస్తున్నది. ఈ విచారణలో వారికి నమ్మశక్యం కాని విషయాలు బయటపడుతున్నట్లు సమాచారం.

46 మంది విచారణ

పెద్దారవీడు మండలంలో సామాజిక భద్రతా పింఛన్లలో ఆరోగ్య పరమైన అంశానికి సంబంధించి ప్రస్తుతం 46 మంది పింఛన్లు పొందుతున్నారు. వారిపై విచారించేందుకు ముగ్గురు డాక్టర్లతో కూడిన బృందం బుధవారం విచారణ ప్రారంభించింది. డాక్టర్ కే. ఆంజనేయులు, డాక్టర్ ఎం.సీతారామిరెడ్డి, యూ.సునీల్‌కుమార్‌లతో కూడిన బృందం బుధవారం 26 మందిని, గురువారం 20 మందిని విచారణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మండలంలోని దేవరాజుగట్టులో బుధవారం విచారణ ప్రారంభించారు.

అర్హులు నలుగురైనా ఉండేనా?

వైద్య బృందానికి విచారణలో ప్రభుత్వం నిర్దేశించిన అంశాలు, ప్రస్తుతం పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు సంబంధించిన అనారోగ్య పరమైన అంశాలకు పొంతన లేకుండా ఉంది. వైద్యాధికారులకు లబ్ధిదారులు భౌతికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నట్లు తేటతెల్లమౌతోంది. దీంతో విచారణ చేస్తున్న వైద్యాధికారులు లబ్ధిదారుల ఆరోగ్యపరిస్థితి చూసి ముక్కున వేలేసుకొని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మండలంలోని మొత్తం 46 మంది ఆరోగ్యపరమైన లబ్ధిదారులలో కేవలం నాలుగైదు మంది మాత్రమే అర్హులుంటారని వైద్యాధికారుల బృందం చర్చించుకుటోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ అనర్హులకు ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా ముట్టజెప్పేందుకు నాయకులు ఈ తతంగానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

నకిలీ సర్టిఫికెట్లు

శాశ్వత ఆరోగ్యపరమైన సమస్యలున్న వారికి సామాజిక భద్రతా పింఛన్లు ఇవ్వడంతో ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ అంశాన్ని వైసీపీ ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతో కేటుగాళ్లు జేబునింపుకునేందుకు అవకాశంగా మార్చుకున్నారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి దొంగ (నకిలీ) సర్టిఫికెట్లు పుట్టించి దరఖాస్తు చేయించడం వెనుక వైసీపీ నేతలు, ద్వితీయ శ్రేణి నాయకుల ఆదేశాలతో అంతా జరిగిపోయింది. ఇలా ప్రభుత్వ సొమ్మును అప్పనంగా కాజేస్తున్నారు.

శ్మశానంలో చిల్లకంప తొలగింపు

అభివృద్ధికి నడుం బిగించిన యువత

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మార్కాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని సుమారు సగం మంది హిందువులకు ఉపయోగపడే శ్మశానం అది. కానీ శ్మశానంతోపాటు చుట్టుపక్కల అంతా కంప ఏపుగా పెరిగింది. దీంతో అంతిమ సంస్కారాలు చేసుకోవడానికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను మున్సిపల్ పాలకులకు, అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలులేవు. స్థానిక సత్యహరిశ్చంద్ర శ్మశానవాటిలో పిచ్చి కంప పెరిగి శవాలను పూడ్చిపెట్టేందుకు కూడా నోచుకోలేని దుస్థితిపై ఈ నెల 22న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ‘అంతిమ సంస్కారాలకూ అవస్థలే’ అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పట్టణంలోని పలువురు యువత పిచ్చికంపను తొలగించేందుకు ముందుకు వచ్చారు. ప్రధానంగా మెయిన్‌బజార్‌లోని టీస్పాట్ యూత్ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో బుధవారం ఉదయం నుంచి పిచ్చికంప తొలగించేందుకు పనులు ప్రారంభించారు.

సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన స్థలంలో పెరిగిన కంపను పూర్తిస్థాయిలో తొలగించారు. శ్మశానంలో ఇష్టారీతిన వ్యర్థాలు వేయడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. దాన్ని కూడా గురువారం పని కొనసాగించి శుభ్రం చేయనున్నట్లు టీస్పాట్ యూత్ సభ్యులు తెలిపారు.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా స్వచ్ఛందంగా ముందుకు కదిలి శ్మశానాన్ని బాగు చేసేందుకు నడుం బిగించిన యువత చైతన్యానికి పుర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్మశానంలో పిచ్చి కంపను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వరి పంటపై అవగాహన

త్రిపురాంతకం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుట్లఉమ్మడివరం, ముడివేముల గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు జనవరి నెలలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు. వరిలో వచ్చే ఉల్లికోడు తెగులు, దాని నివారణ చర్యలను వివరించారు. ఏవో నీరజ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

- కందుల నారాయణరెడ్డి

పొదిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు.పట్టణంలోని సాయిబాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరామన్నారు. గత ఐదుసంవత్సరాలకుపైగా నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సాగర్‌నీటి కనెక్షన్ ఇచ్చి నేడు ఆ కాలనీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. దీన్ని బట్టి కూటమి ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో ప్రజలు గుర్తించాలన్నారు. ప్రస్తుతం పట్టణానికి సాగర్‌నీరు 32 గంటలు ఇస్తున్నారని, దాన్ని 48 గంటలకు పెంచాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోరామన్నారు అలాగే గురువారం మార్కాపురంలో జరిగే లోకేష్‌జన్మదిన వేడుకల్లో పొదిలి నుంచి ఎక్కువ సంఖ్యలో అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ శంకర్‌నాయక్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, కార్యదర్శి శ్రీకాంత్, టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, సామంతపూడి నాగేశ్వరావు, నాయకులు ఆవులూరి యలమంద, రసూల్, ఇమాంమ్‌సా, కాటూరి శ్రీనివాసులు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, ఓబయ్య, యాసిన్, సురేష్ మహిళా నాయకులు షహనాధ్, మెహరున్నీషా పాల్గొన్నారు.



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పలు సమస్యలను లేవనెత్తి పరిష్కారం వెంటనే చేయాలని కోరారు. నియోజకవర్గంలో చాలా వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్యన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, సొంత భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను రెవెన్యూశాఖ ద్వారా కేటాయింపు చేయాలని కోరారు. రాచర్ల, అర్ధవీడు గురుకులాలలో డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలో ఉద్యోగుల కొరత ఉందని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంత్రిని, అధికారులను కోరారు. రాబోయే వేసవి కాలంలో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున సమస్య పరిష్కారానికి ఎస్‌టీఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో అన్ని విభాగాలకు వైద్యులను నియమించాలని, మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, కంభం కమ్యూనిటీ సెంటర్‌లో అన్ని విభాగాల వైద్యులను అందుబాటులోకి తేవాలని కోరారు.

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం వద్దు

పుల్లలచెరువు,జనవరి22(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలిపనులకు వేళ్లే వారు ఆటోల్లో పరిమితికి మించి ఎక్కి ప్రమాదాల బారిన పడవద్దని పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్ కుమార్ అన్నారు. బుధవారం పుల్లలచెరువులో వాహన తనిఖీల్లో భాగంగా అధిక మంది కూలీలతో ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటోకు చలానా విధించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కూలీలను పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించవద్దని అన్నారు. ఏస్పీ ఆదేశాల మేరకు కూలీలకు ఆర్టీసీ ద్వారా బస్సు సౌకర్యం కల్పిస్తున్నదని, ఆ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అధిక మొత్తంలో బెల్లం అమ్మకాలు చేయవద్దు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : చిల్లర దుకాణ యజమానులు అధిక మొత్తంలో బెల్లం అమ్మరాదని ఎర్రగొండపాలెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ సీహెచ్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బెల్లం తీసుకెళ్ళి నాటుసారా తయారు చేస్తున్నారని, వాటిని నివారించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. బెల్లం అమ్మకాలు చేసే ప్రతి కస్టమర్ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని, అలాగే బిల్లులు చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో మర్కాపురం సీఐ గౌస్ బాషా, దుకాణదారులు, యజమానులు పాల్గొన్నారు.

నేడు పుస్తకాల పంపిణీ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంతి నారా లోకేష్ గురువారం పుట్టిన రోజు సందర్భంగా స్థానిక బీసీ బాలికల వసతి గృహం, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, మినీ గురుకులాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల నాయకులు బుధవారం తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

కాశినాయన ఆశ్రమంలో అన్నదానం

గిద్దలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగవాన్ కాశినాయన ఆశ్రమంలో బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధుసన్యాసులు, పేదలు ఆకలితో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఇక నుంచి ప్రతి బుధవారం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురూజీ నారాయణరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వ్యవస్థాపకులు ఎం.శివరంగారెడ్డి, వేమన సేవాసంస్థ అధ్యక్షులు పి.హనుమంతరెడ్డి తెలిపారు. అన్నదానానికి ప్రతినెలా తనకు వచ్చే పింఛన్ డబ్బులో 1000 రూపాయలు తాను జీవించి ఉన్నంతకాలం ఇస్తానని రిటైర్డ్ సర్వేయర్ రెడ్డి మల్లారెడ్డి పేర్కొన్నారు.



రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

● రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి మృతిచెందిన ఆనంద్‌ది సహజమరణం కాదని, నీళ్లలో ముంచి హత్యచేశారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ మండలంలోని కేఎస్‌పల్లెలో బుధవారం ఉదయం మృతుని బంధువులు హైవేపై రాస్తారోకో చేశారు. దీంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. గత ఏడాది అక్టోబరు 28వ తేదీన గడ్డం ఆనంద్ అనే యువకునితోపాటు మరో నలుగురు ఈతకు వెళ్లిన సందర్భంలో ఆనంద్ నీటిలో మునిగి మృతిచెందాడు. ఆనంద్‌ది సహజ మరణం కాదని, నీళ్లలో ముంచి హత్య చేసి ఉంటారని, ఈ అంశంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని అప్పటి నుంచి ఆనంద్ కుటుంబీకులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసి డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఇటీవల పోస్టుమార్టం రిపోర్టు రాగా అందులో సహజ మరణమే అని వైద్యులు నిర్ధారించారు. దీన్ని ఆనంద్ కుటుంబీకులు ఏకీభవించలేదు. పెద్దఎత్తున కుట్ర జరిగిందని, సక్రమంగా పోస్టుమార్టం జరగలేదని, మా కుటుంబానికి అన్యాయం జరిగిందంటూ ఒక్కసారిగా ఆనంద్ కుటుంబీకులు, బంధువులు పెద్ద ఎత్తున అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిపై చెట్టును అడ్డంగా వేసి రాస్తారోకో నిర్వహించారు. దాంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. విషయం తెలుసుకున్న గిద్దలూరు అర్బన్, గిద్దలూరు రూరల్, మార్కాపురం సీఐలు సురేష్, రామకోటయ్య, సుబ్బారావులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఎంత సర్దిచెప్పినా ఆనంద్ కుటుంబీకులు విచారణ సక్రమంగా లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూనే రాస్తారోకో కొనసాగించారు. దాంతో సీఐలు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజుతో ఫోన్‌లో మాట్లాడించారు. ఆనంద్ మృతి విషయంగా ఎలాంటి అపోహలకు పోవద్దని, పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తానని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆనంద్ కుటుంబీకులు రాస్తారోకోను విరమించారు. పోలీసులు, వైద్యశాఖ అధికారులు సమగ్రంగా విచారణ జరిపి మృతుడు ఆనంద్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరుణానిధి

ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో, రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్. కరుణానిధి విమర్శించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిల భారత యువజ సమ్మెఖ్య మహాసభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఆవకాశాలు, నిరుద్యోగ భృతి అందించలేదని అన్నారు. అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాలోని నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా మహాసభ జరుగుతుందని అన్నారు. యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా యద్దనపూడి కోటయ్య, కో కన్వీనర్లుగా కె వెంకేటశ్వర్లు, టి. శ్రీను, మెంబర్లుగా వై.ఏసుబాబు, డి ఆదిత్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వారిని జిల్లా అధ్యక్షులు ఆర్. కరుణానిధి అభినందించారు. కార్యక్రమంలో మాజీ నాయకులు డి. శ్రీనివాస్, కేవీ కృష్ణ గౌడ్, టీసీ హెచ్ చెన్నయ్య, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

పెద్దారవీడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమైన సంఘటన మండలంలోని సానిక వరంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు సానికవరంకు చెందిన కామిశెట్టి శ్రీనివాసులు ఇంట్లో బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో టీవీ, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చాడు.



కాలిపోయిన విద్యుత్ పరికరాలు

32 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్ఐ నరసింహారావు

కంభం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం తురిమెళ్ళ గ్రామంలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. తురిమెళ్ళలో వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి తన గృహంలోనే అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడి చేయగా 32 క్వార్టర్ మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలుబండి రాలేదండి..!

నత్తనడకన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు


దర్శిలో నిర్మాణంలో ఉన్న రైల్వేస్టేషన్

ప్రాథమిక దశల్లోనే పలు పనులు

- ఇప్పటికీ దర్శి రైల్వేస్టేషన్ పనులు పూర్తి కాలేదు.
- ఒక భవనం నిర్మించగా మరో దాని నిర్మాణానికి పునాదులు తీశారు.
- ఒకవైపు రైల్వేలైను మాత్రమే నిర్మాణం పూర్తయింది.
- రెండో లైను నిర్మాణం పనులు ఇప్పుడు ఆరంభించారు.
- రెండో వైపు రైల్వే ప్లాట్‌ఫాం నిర్మాణానికి మట్టితోలి చదును చేశారు.


నిర్మిస్తున్న రెండో ప్లాట్‌ఫాం

- నిరుడు మే నెల.. ఆ తర్వాత సంక్రాంతి అన్నారు.. ముగిసిన రెండు గడువులు
- దర్శి స్టేషన్‌లో పనులు మరింత ఆలస్యం
- ప్రజల చిరకాల కోరిక తీరేదెన్నడు?
- అమలుకు నోచుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల హామీలు

దర్శి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): "అదిగో రైళ్లు వచ్చేస్తున్నాయి.. ఇదిగో రైళ్లు త్వరలో నడుపుతున్నాం"... ఏడాదిగా అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలయ్యాయి. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులు ఎంతోకాలంగా నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వేగం పుంజుకోలేదు. దీంతో దర్శి ప్రాంతానికి రైళ్లు నడిపే ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. పనులన్నీ పూర్తయ్యేందుకు ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. అందువలన ఇప్పట్లో రైళ్లు తిరిగే అవకాశాలు కనిపించటం లేదు.


రెండో రైల్వేలైన్ నిర్మాణానికి తోలిన మెటీరియల్

మళ్లీ మే నెల వస్తున్నా పురోగతి ఏదీ..

గత సాధారణ ఎన్నికలకు ముందు మే నెలలో దర్శి వరకు రైళ్లు నడుపుతామని రైల్వే అధికారులు ఘనంగా ప్రకటించారు. అధికారులు చెప్పిన మాటలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిపోయాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం పనుల్లో కొంతమేరకు వేగం పుంజుకున్నా ఆశించిన స్థాయిలో పూర్తికావడం లేదు. గత నవంబరులో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి రైల్వే నిర్మాణం పనులను పరిశీలించారు. 2025 సంక్రాంతి నాటికి నడికుడి నుంచి దర్శికి రైళ్లు తిరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు అధికశాతం పనులు అరకొరగానే ఉండటంతో ఇప్పట్లో రైళ్లు తిరిగే అవకాశం కనిపించటం లేదు. పనులు నత్తనడకన సాగటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులు వేగవంతంగా పూర్తి చేయించడంతో పాటు రైళ్లు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిమితికి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు

పీసీపల్లి, జనవరి22(ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవనిఎస్సై జి.కోటయ్య ఆటో యజమానులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని పెదఅలవలపాడు వద్ద ఆటోలను తనిఖీ చేశారు.

స్వామి బంగారు, వెండి ఆభరణాల తనిఖీ

పామూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మదన వేణుగోపాల స్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాల్లోని స్వామికి రాజులు, దాతలు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలను గుంటూరుజోన్ ఎండోమెంట్ శాఖ జువెలరీ వెరిఫికేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షణలో స్వామి ఆభరణాలను రికార్డు ప్రకారం తూకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకొకసారి స్వామి ఆభరణాలను తనిఖీ చేయాల్సి ఉండగా ప్రస్తుతం 12 ఏళ్ల అనంతరం వాటిని లెక్కిస్తున్నామన్నారు. దాతలు బంగారు వస్తువులు ఇవ్వాలనుకుంటే ఈవో సమక్షంలో సమర్పించి రసీదు పొందాలని, అప్పుడే అవి రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు. గతంలో 2007లో వల్లీ భుజంగేశ్వర దేవస్థానంలో కొన్ని వస్తువులు చోరీ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. 2011లో మదనవేణుగోపాలస్వామి దేవస్థాన ఆభరణాల నివేదికపై పరిపాలనాధికారులు విచారణ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, బండ్లనారాయణగుత్తి వెంకటరాజ, ఉమ్మడిశెట్టి శ్రీను, జమకాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆభరణాలను లెక్కిస్తున్న జువెలరీ విభాగ కమిషనర్ శ్రీనివాసరావు

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలను పరిష్కరించి ప్రజలు ఇబ్బందులను తొలగించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జె. ఇమ్మానియేల్‌రాజు అధ్యక్షతన రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకొని ఇబ్బందులు పెట్టవద్దని చెప్పారు. గ్రామ స్థాయి అధికారులు తీరు పట్ల ప్రజల్లో, రైతుల్లో కొంత అసంతృప్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్, ఆర్ఐ అనూష, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఇమ్మానియేల్‌రాజు బాధ్యతల స్వీకరణ

తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జె.ఇమ్మానియేల్‌రాజు బాధ్యతల స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ కె.సంజీవరావు అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజును ఇన్‌చార్జి తహసీల్దార్(పూర్తిఅదనపు బాధ్యత)గా నియమిస్తూ కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వం చొరవతో విశాఖ ఉక్కుకు భరోసా

టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చొరవతో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా ఏర్పడిందని టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి) చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం కేంద్రం విశాఖ ఉక్కుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు 11,440 కోట్ల రూపాయలు ప్యాకేజీని ప్రకటించటం సంతోషించదగ్గ విషయమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎంతో చొరవ చూపారని కొనియాడారు. మరో నేత తమ్మినేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని జగన్ ప్రయత్నిస్తే విశాఖ ఉక్కును పరిరక్షించటం కోసం చంద్రబాబు, పవన్‌లు అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఐవీ నారాయణ, ఫిరోజ్, బుల్లా బాలబాబు, జంషీర్ అహ్మద్, దింటకుర్తి సుబ్రమణ్యం, కేవీఎస్ గౌడ్, రిజ్వాన్, గయాజ్, తెలుగు మహిళలు కరణం అరుణ, దొరసాని, స్వప్న పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో సమస్యలు పరిష్కారం

దొనకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి చెప్పారు. మండలంలోని వీవీపురం రెవెన్యూ గ్రామంలో రెండోదశలో రీసర్వేకు ఎంపిక చేశారు. అందులో భాగంగా బుధవారం దొనకొండ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆర్డీవో మాట్లాడుతూ భూములకు సంబంధించి రికార్డుల్లో ఏమైనా లోపాలుంటే సంబంధిత వ్యక్తులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉచిత పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్ రమేష్ కోరారు. మండలంలోని రేగులచెలుక, అయ్యావారిపల్లి గ్రామాల్లో జరుగుతున్న పశుఆరోగ్య శిబిరాల్లో 64లేగ దూడలకు, 450 గొర్రెలకు, నట్టల నివారణ మందులు తాపించారు. 36 గేదెలకు వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఓస్ శ్రీనివాసులు, బీ శివజ్యోతి, హనుమంతరావు, నూర్జహన్, నవీన్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

అవీఇవీ

కొర్రపాటివారిపాలెం అభివృద్ధికి కృషి

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని ఆదరించే కొర్రపాటివారిపాలెం అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి హామీఇచ్చారు. తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, కొర్రపాటివారిపాలెం టీడీపీ సీనియర్ నాయకులు బుధవారం నర్సరావుపేటలో డాక్టర్ లక్ష్మి,లలిత్ సాగర్‌లను కలిశారు. ఇటీవలి పరిణామాలపై చర్చించారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి తాము కట్టుబడి పనిచేస్తున్నామని, టీడీపీ కార్యకర్తలను అన్నివేళలా కాపాడతామని చెప్పారు. గ్రామంలో మంచినీటిస్కీం పనులు నిలిచిపోయాయని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని టీడీపీ నాయకులు కోరారు. అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తామని లక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, గ్రామ సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి రామయ్య, మాజీ సర్పంచ్ కోట నరసింహారావు పాల్గొన్నారు.


లక్ష్మిని కలిసిన టీడీపీ నాయకులు

పింఛన్‌దారులను విచారించిన వైద్య బృందం


పింఛన్ లబ్ధిదారులను విచారిస్తున్న వైద్య బృందం

ముండ్లమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నెల నెలా రూ.15వేలు తీసుకుంటున్న పింఛన్‌దారులను వైద్య బృందం బుధవారం వారి ఇళ్లకెళ్లి విచారణ చేపట్టారు. పులిపాడులో ముగ్గురు, పెద ఉల్లగల్లులో ఇద్దరు, ముండ్లమూరులో ఒకరు, నాయుడుపాలెంలో నలుగురు, పోలవరంలో ఒకరు, ఈదరలో ముగ్గురు, మారెళ్లలో ఎనిమిది మంది, నూజెండ్లపల్లి ఒకరిని విచారించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం అశోక్ బాబు, ఆర్థోపెడిక్ ఎంఎస్ సౌజన్య, జనరల్ మెడిసిన్ సీహెచ్ ప్రవీణ్, మారెళ్ల వైద్యాధికారి పీ జెస్సీప్రతాప్, డిజిటల్ అసిస్టెంట్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కే సురేష్‌రెడ్డి, జే శ్రీనివాసరావు, షమీలా బేగం, అమరేశ్వరి పాల్గొన్నారు.

జీవనజ్యోతి బీమా నగదు అందజేత

పామూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీనరసాపురానికి చెందిన పూరిమెట్ల శ్రీనివాసులు గత ఏడాది ఆగస్టు 26న మరణించారు. మృతుని పేరు మీద స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవనజ్యోతి సురక్ష పథకం కింద బీమా కలిగి ఉంది. మృతునికి బీమా పథకం కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. బీమా సొమ్మును మృతుని భార్య పద్మకు బుధవారం రూ.2 లక్షల బ్యాంకు చెక్కును మేనేజర్ టీ మురళీకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ వై భాను అందజేశారు.


బీమా నగదును అందజేస్తున్న మేనేజర్లు

కనిగిరిలో మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. కనిగిరిలో బుధవారం ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి నరేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ఎం(జీసీఅండ్‌వైపీఎస్) డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 6 కంపెనీలు పాల్గొన్నాయి. 105 మంది హాజరు కాగా, 43మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాయి. రెండో రౌండ్‌లో మరో 8మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏలూరి సుబ్బారావు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ షేక్ బాషా, జిల్లా ఉపాధి కార్యాలయం యంగ్ ప్రొఫెషనర్ డీ రమేష్‌బాబు, జీటీ నర్మదా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పామూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పామూరు మండలంలోని పుట్టంనాయుడుపల్లికి చెందిన మేడిద రమణయ్య తన ఆటోలో పీసీపల్లిలోని మెట్టవారిపాలెం లో బొబ్బర్లు పంట కోతల కోసం కూలీలను తీసుకెళుతున్నాడు. బొట్లగూడూరు నుంచి వెళుతుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా ఆటో ఇంజన్ సీజ్ కావడంతో అదుపుతప్పి ఆటో నడుపుతున్న రమణయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిశోర్‌బాబు చెప్పారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

ముండ్లమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీంద్రబాబు అనే బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద బుధవారం ఎస్ఐ వై నాగరాజు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా 25 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పున్నారావు, మరియబాబు పాల్గొన్నారు.

సైడు కాలువల నిర్మాణం చేపట్టాలి


సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో అన్నీ ప్రాంతాల్లో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులను ఆదేశించారు. దర్శిలో ఒకటో వార్డులో బుధవారం ఆయన సిబ్బందితో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, కాల్వలు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరగా వీలైనంత త్వరగా నిర్మాణ పనుల చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా 'దారా' నియామకం

తాళ్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా హనుమంతునిపాడు మండల పరిషత్ కార్యాలయం ఈవో దారా హనుమంతరావును నియమిస్తూ సీఈవో బి.చిరంజీవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సుందరరామయ్య సెలవుపై వెళ్లారు. పాలనాసౌలభ్యం కోసం హనుమంతురావును అదనపు బాధ్యతలు అప్పగించారు.



మెప్మాలో మాయాజాలం

జగనన్న మహిళా మార్ట్‌లో రూ.10 లక్షల పెట్టుబడి
లాభాలు లేకపోగా అసలుకే కోత.. అవి ఇచ్చేదెప్పుడో?
మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆవేదన

అద్దంకి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏటా జగనన్న మహిళా మార్ట్ ద్వారా వచ్చే లాభాలు పంచుతాం... మాది గ్యారెంటీ అంటూ మెప్మా అధికారులు, సిబ్బంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో మూడేళ్ల క్రితం బలవంతంగా సుమారు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టించారు. నిర్వహణ పేరుతో నెలనెలా మెప్మా అధికారులు, నిర్వహణ కమిటీ ఇష్టానుసారం జీతాలపేరుతో ఆ పెట్టుబడిని వాడుకున్నారు. ఎప్పటికప్పుడు జమాఖర్చుల లెక్కలను వాయిదా వేస్తూ వచ్చారు. గుట్టుచప్పుడు కాకుండా ఆడిట్ కూడా చేయించినట్లు తెలుస్తుంది. అద్దంకిలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం వద్ద నామ్ రోడ్డు వెంబడి ఉన్న అన్నా క్యాంటీన్‌లో 2022 ఫిబ్రవరి 3న జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మెప్మా అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదు. ఆర్పీలకు టార్గెట్‌లు విధించి స్వయం సంఘాల సభ్యులు చేత బలవంతంగా బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలకు సరుకులను కూడా కొనుగోలు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభించే క్రమంలో మహిళా మార్ట్‌ను మూసివేశారు. అయితే పెట్టుబడి నిధిపై సభ్యులు ఆందోళన చేయడం, మంత్రి రవికుమార్‌కు వినతిపత్రాలు ఇవ్వడంతో నిధుల విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేశారు. దీంతో మెప్మా నిర్వహణ పర్యవేక్షణ చేసిన కమిటీ, అధికారులు విడతల వారీగా బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలుస్తుంది. అయితే ప్రస్తుతం బ్యాంక్ ఖాతాలో సుమారు రూ.7 లక్షలు ఉండగా, మిగిలిన పెట్టుబడి నిధిని ఫర్నిచర్ కొనుగోలుకు వెచ్చించినట్లు చూపించారని సమాచారం. సభ్యుల పెట్టుబడి నిధితో చేసిన వ్యాపారం ద్వారా వచ్చిన లాభాలు నిర్వహణకే వెచ్చించినట్లు జమా ఖర్చులు చూపించినట్లు తెలుస్తుంది. మూడేళ్ల క్రితం సుమారు 8 వేల మంది పెట్టుబడి పెట్టిన రూ.10 లక్షల పెట్టుబడి నిధులలో ప్రస్తుతం రూ.7 లక్షలు, ఫర్నిచర్ అమ్మితే వచ్చే డబ్బులు కలిపి పంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే బ్యాంక్‌లో ఉన్న పెట్టుబడి నిధి పంపిణీ విషయంలో జాప్యం జరుగుతుండడంతో సభ్యులలో ఆందోళన నెలకొంది. మెప్మాలోని రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి అనుమతి వచ్చిన తరువాత పెట్టుబడి నిధి కోసం ఎదురు చూపులతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంక్ ఖాతాలో ఉన్న పెట్టుబడి నిధులను వెంటనే సభ్యులకు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



అద్దంకిలోని జగనన్న మహిళామార్ట్ (ఫైల్)

167ఏ హైవేలో నరసరావుపేట బైపాస్ భూసేకరణ వివాదాస్పదం
నరసరావుపేట బైపాస్ మినహా రహదారి నిర్మాణానికి సమాయత్తం
బాపట్ల జిల్లా పేజ్-1లో వేగవంతంగా రహదారి నిర్మాణ పనులు
రూ.1,064.24 కోట్లు మంజూరు..
రెండో దశ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి

మార్చేందుకు అంగీకరించని అధికారులు
మార్చాలని రైతులు పట్టు.. సీఎంకు వినతి


చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

అలైన్‌మెంట్ అలాగే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి బైపాస్ అలైన్‌మెంట్ మార్చండి.. నరసరావుపేట మున్సిపల్ పరిధిలో రోడ్డు వేస్తున్నారు.. దీనివల్ల ఫలితం ఉండదు.. అలైన్‌మెంట్ మార్చి పట్టణానికి దూరంగా వేయాలి.. అని రైతులు పట్టుబడుతున్నారు. అయితే కుదరదు.. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రహదారి నిర్మాణం జరుగుతుంది.. అని నేషనల్ హైవే అధికారులు తేల్చి చెప్తున్నారు. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. నరసరావుపేట బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంది. అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు సర్వే రాళ్లను తొలగించడం.. భూముల్లో మార్కింగ్ చేయకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. నేషనల్ హైవే అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చేందుకు ససేమిరా అని తేల్చిచెబుతున్నారు. నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. సర్వే చేసి రైతులకు నోటీసులు జారీ చేశారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడంలేదు. నరసరావుపేట మండలం కేసానుపల్లిలో 85.39, జొన్నలగడ్డ 37.15, నరసరావుపేట 33.55, గుంటగార్లపాడు 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ గ్రామాల పరిధిలో భూసేకరణ వివాదాస్పదంగా మారడంతో రెండో దశలో మిగతా ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వేగంగా పనులు

మొదటి దశలో నిర్మిస్తున్న రహదారికి చిలకలూరిపేట కొత్త బైపాస్‌లోపు భూసేకరణ పూర్తి చేశారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసల రహదారికి భూసేకరణ చేయాల్సి ఉంది. కావూరు నుంచి కనపర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28 ఎకరాలు, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల సేకరణకు రైతులు సహకరించినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలో భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రహదారి నిర్మాణం ఇలా..

బాపట్ల జిల్లా ఒడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డ రోడ్డు వరకు రెండు వరసల రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తున్నారు. రెండు ప్యాకేజీలు రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) పనులు నిర్వహిస్తోంది. ఒడరేవు బీచ్ నుంచి రహదారి నిర్మాణం ప్రారంభమవుతోంది. 45 మీటర్ల వెడల్పున భూమిని సేకరిస్తారు. గత ఫిబ్రవరిలో మొదటి ప్యాకేజీలో పనులు ప్రారంభమయ్యాయి. ఒడరేవు, చీరాల, కారంచేడు, పర్చూరు, తిమ్మరాజుపాలెం, చిలకలూరిపేట, గంగన్నపాలెం, నరసరావుపేటలో బైపాస్‌లు నిర్మిస్తారు. 85 కిలోమీటర్ల రహదారి నిర్మాణంలో 46 కిలోమీటర్లు బైపాస్‌ల నిర్మాణం ఉంటుంది. ప్యాకేజి ఒకటిలో ఒడరేవు నుంచి చిలకలూరిపేట వరకు 47 కిలోమీటర్లు.. ప్యాకేజ్ రెండులో చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లు. కారంచేడు-పర్చూరు మధ్య ఉప్పుటూరు వద్ద ఒక టోల్ ప్లాజా, చిలకలూరిపేట మండలం కావూరు దగ్గర మరో టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తారు. తొమ్మిది ఫ్లైఓవర్లు, రెండు ఆర్‌వోబీలు.. ఆరు మేజర్ బ్రిడ్జిలు, రెండు ఇంటర్ ఛేంజింగ్‌లు నిర్మిస్తారు. 167ఏ జాతీయ రహదారి చీరాల, చిలకలూరిపేట ప్రాంతాల్లో రెండు జాతీయ రహదారులను కలుపుతారు. వాకావారిపాలెం దగ్గర చీరాల కారంచేడుకు బైపాస్ 14.3 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తారు. పర్చూరు-గుంటూరు రోడ్డు క్రాసింగ్ దగ్గర మరో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. చిలకలూరిపేట రోడ్డులో కలుస్తుంది. చిలకలూరిపేటకు మరో బైపాస్ వస్తోంది. పసుమర్రు దగ్గరలో దీనిని నిర్మిస్తారు. బొప్పూడి దగ్గర కొత్త బైపాస్‌లో కలుస్తుంది.

టెండర్ నిర్వహణలో జాప్యం..

ప్యాకేజ్ రెండులో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. రెండో ప్యాకేజీలో భూసేకరణ జాప్యం కారణంగా టెండర్ నిర్వహణలో జాప్యం జరిగింది. కొత్త బైపాస్ నుంచి ప్యాకేజ్ రెండు ప్రారంభమవుతుంది. పాత రహదారిని విస్తరిస్తారు. గంగన్నపాలెంలో బైపాస్ వస్తుంది.

ఈశ్వర్ కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్క నుంచి కుప్పగంజి వాగు మీదగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ క్రాస్ చేస్తారు. ఇక్కడ ఆర్‌వోబీని నిర్మిస్తారు. నరసరావుపేట-గుంటూరు రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో ఇది కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అడ్డరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఈ గ్రామం వద్ద ఇంటర్ చేంజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.

మార్కెట్ సెస్ లక్ష్యం రూ. 476 కోట్లు

● 9 జిల్లాల పరిధిలోని 90 యార్డులలో ఎరువుల విక్రయ కేంద్రాలు ● మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు



వేమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజియన్ పరిధిలోని 9 జిల్లాల్లో ఉన్న 90 వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.476 కోట్లు మార్కెట్ సెస్ వసూలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరు నాటికి రూ.270 కోట్లు వసూలు చేశామని, మిగిలిన రూ. 206 కోట్లును మూడు నెలల్లోగా వసూలు చేస్తామని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వేమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విచ్చేసి విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు, కృష్ణ, గుంటూరు, బాపట్ల ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న 90 యార్డులలో రైతుల సౌకర్యార్థం రసాయన ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఎరువులు విక్రయించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లు ద్వారా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యార్డుల అభివృద్ధికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎరువులతో పాటుగా విత్తనాల కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జొన్న, మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతుబంధు పథకం ద్వారా మార్కెట్ యార్డు గోదాములలో నిల్వ చేసిన ధాన్యానికి సరుకు విలువలో 75 శాతం గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని అందజేస్తాం అన్నారు. ఒకసారి పొందిన రైతుబంధు పథకం కార్డును ఐదు సంవత్సరాల వరకు వినియోగించుకోవచ్చన్నారు. సరుకుకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. నామమాత్రపు అద్దె కింద బస్తాకు నెలకు రూపాయి చొప్పున, అలాగే ఇన్సూరెన్స్ చార్జీల కింద బస్తాకు నెలకు ఒక రూపాయి చొప్పున మాత్రమే వసూలు చేస్తారని వివరించారు. సౌకర్యాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో యార్డు కార్యదర్శి అంజిబాబు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ, థాయిలాండ్ మధ్య ఎంవోయూ

పెదకాకాని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బోటనీ, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ రెన్యువబుల్ ఎనర్జీ విభాగం, ఏఎన్యూ మైక్రోబయాలజీ విభాగం పరస్పర సహకారాన్ని అందించుకుంటాయని పేర్కొన్నారు. అధ్యాపకుల మార్పిడి, బోధన, పరిశోధన, ఇతర పునరుత్పాదక శక్తి వనరుల సాంకేతిక వినిమయం, ఆసియా ఖండంలో ప్రజల మధ్య శాంతి కొరకు కలిసి పని చేయాలని ఈ అవగాహన ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నట్లు మల్లికార్జున వివరించారు. ఈ సందర్భంగా మేజో యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రమేష్ ప్రభు, ప్రొఫెసర్ యువ లే విశ్వవిద్యాలయంలోని వృక్ష జీవశాస్త్ర విభాగాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్, ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య అమృతవల్లి, డాక్టర్ మాధవి, ఆచార్య ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ కె.నాగ రాజు, డాక్టర్ కె.విజయ్, డాక్టర్ మిథున్, బాలరాజు పాల్గొన్నారు.


వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావుని కలిసిన థాయిలాండ్ యూనివర్సిటీ ప్రతినిధులు



ప్రగతిని చాటిచెప్పేలా..

జాతీయపండుగ : జేసీ

బాపట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిని చాటిచెప్పేలా జాతీయ పండుగను అధికారులు ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. 18 స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కనీసం 12 శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవం నిర్వహించే పోలీసు కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించేలా ఉండాలన్నారు. బారికేడ్ల ఏర్పాటుతో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలకు హాజరైన ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వరద విపత్తు సమయంలో కష్టపడి పని చేసిన అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. ఇందుకోసం అన్నిశాఖలలో ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను 23వ తేదీ సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





బొడ్డువానిపాలెంలో రహదారి భద్రతపై గ్రామస్థులకు వివరిస్తున్న ఎంవీఐ ప్రసన్నకుమారి, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ

రహదారి నిబంధనలు పాటించాలి

మేదరమెట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రహదారి నిబంధనలను పాటించి ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్త వహించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి తెలిపారు. బొడ్డువానిపాలెంలో బుధవారం పొగాకు రైతులు, కూలీలకు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమారి మాట్లాడుతూ పచ్చాకు ట్రాక్టర్‌లపై కూలీలు ప్రయాణించవద్దన్నారు. ట్రాక్టర్‌లకు పక్కనున్న విడిచి వాటిపై కూర్చుంటే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రమాదంలో మీతోపాటు ఎదుటి వాహనాలపై ఉన్నవారు కూడా ఇబ్బంది పడతారన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు కూలీలను ఎక్కించుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు రెండు వైపులా చూసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శనగలో పచ్చపురుగు నివారణకు చర్యలు



శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ, సిబ్బంది

అద్దంకిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : శనగ పంటలో పచ్చ పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రబీలో సాగు చేసిన శనగ ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నందున అందులో కాయ తొలుచు పురుగును గుర్తించామన్నారు. దాని నివారణకు ఇమామెక్టిన్ బెంజో ఏట్ మందు లీటర్ నీటికి 0.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయబోతున్నట్లు, ఆ గుర్తింపు సంఖ్య ద్వారానే అన్ని పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, రైతులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లు

అంధకారంతో మేదరమెట్ల సెంటర్



సెంటర్‌లో ఉన్న పోల్‌కు వెలగని లైట్లు

మేదరమెట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల సెంటర్‌లో గత ఆరు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు. రహదారులు భవనాల శాఖ మేదరమెట్ల సెంటర్‌లో సుమారు కోటి రూపాయలు వెచ్చించి వీధి లైట్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ మేదరమెట్ల పంచాయతీకి అప్పగించారు. ఆరు నెలలుగా మేదరమెట్ల పంచాయతీ అధికారులు వెలగని వీధి దీపాల స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేయలేదు. వీధి దీపాలను ఏర్పాటు చేయకుండా అధికారులు పలు సాకులు చెప్తున్నారు. దుకాణాల లైట్లు వెలుతురు, రోడ్డున వెళ్లే వాహనాల కాంతితోనే సాగిపోతోంది. రాత్రి పది గంటల తరువాత మేదరమెట్ల సెంటర్ మొత్తం అంధకారంగా మారుతుంది. రాత్రి పూట ఒంగోలు, విజయవాడ నుంచి వచ్చే ప్రయాణికులు వీధీ దీపాలు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. దొంగతనాలకు కూడా అవకాశం పెరిగింది. 6 నెలలుగా వీధీ దీపాలు వేయకపోవడం పట్ల మేదరమెట్ల, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీకి పండుగే..!

- సంక్రాంతికి 721 ప్రత్యేక బస్ సర్వీసులు
- ప్రకాశం రీజియన్‌కు రూ.1.69కోట్ల ఆదాయం
- అత్యధికంగా కనిగిరి డిపో నుంచే రాకపోకలు

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సంక్రాంతి పండుగ ప్రజలకే కాదు.. ఆర్టీసీకి పెద్ద పండుగే అయ్యింది. గత ఐదేళ్లలో సరైన వనరులు లేక, కాలం చెల్లిన బస్సులతో ఎలాగోలా నెట్టుకురాగా, ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బస్సులను తొలగించడంతోపాటు అవసరమైన డిపోలకు కొత్త బస్సులను ఏర్పాటుచేసింది. దాంతో పెద్ద పండుగకు నగరాల నుంచి వచ్చే వారంతా ఆర్టీసీ వైపే మొగ్గుచూపారు. అటు ప్రైవేటు ట్రావెల్స్‌లో చార్జీల మోతతో భయపడిన ప్రయాణికులు సాధారణ చార్జీలతోనే ఆర్టీసీలో ప్రయాణించారు. ఈ సంక్రాంతికి జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 721 ప్రత్యేక బస్సులను నడపగా, రూ.1.69కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో జిల్లాలోని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒంగోలుతోపాటు గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, పొదిలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపగా, అత్యధికంగా కనిగిరి డిపో నుంచే తిరిగాయి. ఆ వచ్చిన ఆదాయంలో అత్యధికంగా కనిగిరి డిపో నుంచే రావడం విశేషం. మొత్తంగా ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నా ఆర్టీసీకి ఈ సంక్రాంతి ఆదాయ వనరులు పెంచింది.

60 వేల మంది ప్రయాణికులు

ఈ ఏడాది సంక్రాంతికి సుమారుగా 60వేల మంది జిల్లాలోని తమ సొంతూర్లకు వచ్చి తిరిగి వెళ్లారు. జిల్లాకేంద్రమైన ఒంగోలు నుంచి 168 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయగా, 9,756 మంది ప్రయాణించారు. కనిగిరి డిపో నుంచి 253 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా, 27,737 మంది ప్రయాణించారు. అలాగే మార్కాపురం డిపో నుంచి 122 బస్సులలో 9,013 మంది, పొదిలి నుంచి 108 బస్సులలో 9,692 మంది, గిద్దలూరు నుంచి 70 బస్సులలో 2,908మంది రాకపోకలు సాగించారు. కనిగిరి, ఒంగోలు, మార్కాపురం డిపోల నుంచి అధికంగా ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది 2025లో సంక్రాంతికి సందర్భంగా మొత్తం 721 ప్రత్యేక బస్సులు 4,68,534 కి.మీ రాకపోకలు సాగించగా, రూ.1,69,30,555 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. గతేడాది 2024లో సంక్రాంతికి 504 బస్సులు 3,40,601 కి.మీ నడపగా, రూ.1,23,97,820 ఆదాయం వచ్చిందని తెలిపారు.

వెలిగొండ కదలింది!

- మంత్రుల పర్యటన తర్వాత కీలక పనులపై దృష్టి
- సీఎం ఆదేశాలతో పునఃప్రారంభం
- రెండవ టన్నెల్‌లో గ్యాంట్రీ విధానంలో లైనింగ్ పనులు
- ఫీడర్ కాలువలో 16 కి.మీ లైనింగ్‌కు రూ.206 కోట్ల ప్రతిపాదనలు
- మరో ఆరు కిలోమీటర్ల మట్టికట్ట పటిష్టతపై సర్వే
- కంభం ఎస్‌డీసీ పరిధిలో పునరావాస చర్యలకు రూ.80కోట్లు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి లక్ష్యం
- త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్న ప్రజలు
- బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయింపుతోనే మరింత ఫలితం



ఫీడర్ కాలువలపై సర్వే కోసం తవ్వకాలు

వెలిగొండ ప్రాజెక్టు వ్యవహారంలో కదలిక వచ్చింది. కీలకమైన పనులు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. ఎక్కడి పనులు అక్కడ ఉండగానే ఎన్నికల్లో లబ్ధి కోసం టన్నెల్‌ను జాతికి అంకితం చేస్తున్నామంటూ జగన్మోహన్‌రెడ్డి హడావుడిగా ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించింది. అయితే అప్పుడు పూర్తిచేస్తాం, ఇప్పుడు పూర్తిచేస్తాం అని ఆర్భాటపు ప్రకటనలు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించి ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించి పెండింగ్ పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేసేలా చర్యలు చేపడుతోంది. అందులోభాగంగానే ప్రభుత్వం వెలిగొండపై దృష్టిసారించింది.

ఒంగోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనులలో కదలిక వచ్చింది. ప్రభుత్వం ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన తొలినెలలోనూ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష జరిగినప్పుడు వెలిగొండపై సమగ్ర నివేదికతోపాటు పనుల పూర్తికి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆపై ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రాజెక్టును సందర్శించారు. మంత్రులు స్వామి, గొట్టిపాటి రవికుమార్‌తోపాటు జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులతో కలిసి టన్నెల్ తవ్వకాలు, ఫీడర్ కాలువలు, పునరావాస కాలనీలను చూశారు. అధికారులతో సమీక్ష చేశారు. 4.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తికి ఏడు ప్యాకేజీలతో చేపట్టారని, రూ.8,043కోట్లు మంజూరు కాగా రూ.6,059 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. అందులో పనుల కోసం రూ.4,987 కోట్లు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం ఇతరత్రా మరో రూ.1,100 కోట్లు ఖర్చుచేశారన్నారు. ఆ మేరకు మంత్రికి నివేదించిన అధికారులు మొత్తం ప్రాజెక్టు పూర్తికి మరో రూ.1,700 కోట్లు అవసరమవుతాయని తద్వారా ప్రాజెక్టు వ్యయం రూ.9,741 కోట్లకు చేరుతుందని వివరించారు.

లోపభూయిష్టంగా పనులు

కీలకమైన ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయినప్పటికి దాదాపు 15ఏళ్ల క్రితం చేయడం వల్ల 22.9 కిలోమీటర్ల ఫీడర్ కాలువల కట్టలు అనేకచోట్ల దెబ్బతినడం, భారీ రంధ్రాలు పడి వర్షపునీరు వాటి ద్వారా బయటకు రావడం, కొన్నిచోట్ల పూడిపోవడం, చిట్టడవిని తలపించేలా ఉండటాన్ని మంత్రులు గుర్తించారు. అలాగే టన్నెళ్ల పనులు కూడా లోపభూయిష్టంగా దర్శనమిచ్చాయి ఒక్కొక్కటి 18.80 కి.మీ ఉండే ఏడు మీటర్లు ఒకటి, 9.20 మీటర్లు మరొకటి రెండు టన్నుళ్లు ఉన్నాయి. తొలి టన్నెల్ తవ్వకం గత టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తికాగా రెండవ దానిని కూడా రెండొంతులు తవ్వారు. తవ్వకం, లైనింగ్ ఒకేసారి టన్నెల్ బోర్ మిషన్ ద్వారా చేయాల్సి ఉండగా వైసీపీ హయాంలో మాన్యువల్‌గా చేశారు. లైనింగ్ లేకుండా చేయడమే కాక తొలి టన్నెల్‌కు రెండవ టన్నెల్‌కు మూడుచోట్ల భారీ రంధ్రాలు పెట్టారు. తవ్విన మట్టిని కూడా బయటకు కాకుండా కృష్ణానది వైపు హెడ్ రెగ్యులేటరీ సమీపంలో పోశారు. ఇలా అనేక అవకతవకలు, భవిష్యత్‌లో సమస్యలు తెచ్చే అవకాశం ఉన్న అంశాలను నాటి పరిశీలనలో మంత్రులు గుర్తించారు.

కీలక పనులపై దృష్టి

తదనంతరం నవంబరు రెండవవారంలో ఇలాంటి కీలక ప్రాజెక్టులపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సందర్భంగా అన్ని అంశాలు చర్చకు వచ్చాయి. వాటిపై స్పందించిన చంద్రబాబునాయుడు పనులు పూర్తికాకుండా నీరు ఇవ్వడం సరైంది కాదని గుర్తించి 2026 జూన్‌కు మొత్తం పనులు పూర్తి లక్ష్యం పెట్టుకొని నిర్దిష్ట ప్రణాళికతో వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు నిర్వహించే మెగా కంపెనీ ప్రతినిధులతోనూ స్వయంగా మాట్లాడి తగు సూచనలు చేశారు. దాంతో వెలిగొండపై కదలిక వచ్చింది. కీలక పెండింగ్ పనులపై దృష్టిసారించారు. ప్రధానంగా రెండవ టన్నెల్‌లో లైనింగ్ పనులు డిసెంబరులో పునఃప్రారంభించారు. టీబీఎం లేకపోవడంతో గ్యాంట్రీ విధానంలో (కూలీలతో) లైనింగ్ చేస్తున్నారు. రెండు విభాగాలుగా ఈ పనులు చేపట్టగా ఒక్కొక్క దానిలో 50 నుంచి 60 మంది కూలీలు పనులు చేస్తున్నారు. నెలకు ఒక్కొక్క బృందం సగటున 150 మీటర్ల లైనింగ్ చేసేలా ప్లాన్ చేశారు. ప్రస్తుతం రెండు విభాగాలుగా జరుగుతుండగా ఏప్రిల్ నుంచి మరో గ్యాంట్రీని కూడా ఏర్పాటు చేసి మూడింటి ద్వారా నెలకు 450మీటర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

రూ.206కోట్లతో లైనింగ్

కీలకమైన ఫీడర్ కాలువలపైనా అధికారులు దృష్టి సారించారు. టన్నెల్ నీరు బయటకు వచ్చే దోర్నాల మండలం కొత్తూరు నుంచి నల్లమల రిజర్వాయర్ వరకు కొండల అంచున దాదాపు 22కిలోమీటర్లు ఈ కాలువ ఉంది. అందులో 16 కి.మీ దూరం కొండల అంచున మట్టి తొలిచి కాలువలు చేయగా ఆరు కి.మీ మేర మట్టికట్టలు వేసి చేశారు. పదిహేనేళ్ల క్రితం చేసిన పనికావడంతో ప్రస్తుతం ఫీడర్ కాలువ అధ్వానంగా ఉంది. తిరిగి దానిని సక్రమంగా చేయడానికి కొండల అంచు తవ్వి కాలువగా వేసిన 16కి.మీ మేర లైనింగ్ అవసరంగా ఉన్నతస్థాయి నిపుణులు సూచించారు. దీంతో ఆ మేరకు సర్వే చేసి రూ.206 కోట్లతో లైనింగ్‌కు ప్రాజెక్టు అధికారులు అంచనా వేయగా ఉన్నత స్థాయిలోని సెంట్రల్ డిజైన్స్ సంస్థ ఆమోదం తెలిపింది. త్వరలో ఆ పనులు ప్రారంభించాల్సి ఉంది.

మూడు బృందాలతో సర్వే

మరోవైపు మట్టికట్టలు పోసి కాలువగా చేసిన 6 కి.మీ దూరంపై ఎలా చేయాలన్న దానిపై సర్వే జరుగుతోంది. గతనెలలో విజయవాడలోని ఇంజనీరింగ్ కళాశాల, అలాగే అగ్రికల్చర్ ల్యాబ్‌కు చెందిన బృందాలు విడివిడిగా వచ్చి సర్వే చేసి వెళ్లాయి. ప్రస్తుతం వారంరోజులుగా హైదరాబాద్‌కు చెందిన మరో ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ బృందం మట్టి నమూనాలు తీస్తోంది. వాటిని ల్యాబ్‌లలో పరిశీలన చేస్తారు. మూడింటి రిపోర్టుల ఆధారంగా ఆ కాలువలు తదుపరి పనులపై ఒక నిర్ణయం తీసుకోనున్నారు. వచ్చేనెల తొలివారం నాటికి దీనిపై స్పష్టత రానుంది. ఇక అత్యంత ప్రధానమైన నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపు, కాలనీల్లో సౌకర్యాలు తదితర అంశాలపైనా ప్రభుత్వ స్థాయిలో కదలిక కనిపిస్తోంది. ముంపు గ్రామాల్లోని సుమారు ఏడున్నర వేల నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపునకు రూ.800కోట్లు, కాలనీ ఏర్పాటు సౌకర్యాలు, భూసేకరణకు మరో రూ.500 కోట్లు కలిపి రూ.1,300 కోట్లుకు 2021 ఫిబ్రవరిలో జీవో ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకపోవడంతో ఆ ప్రక్రియ అంతా నిలిచిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆ విషయంపై ప్రత్యేక దృష్టిసారించింది.

దశలవారీ పునరావాసం

ప్రాజెక్టుల పనులు ముందుకు సాగుతున్న కొద్దీ దశలవారీ పునరావాస వ్యవహారాన్ని చూడాలని నిర్ణయించింది. తొలిగా కంభం ఎస్‌డీసీ పరిధిలో సుమారు రూ.80 కోట్లును ఇప్పుడు ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే బడ్జెట్‌లో ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తారని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చెప్తున్నారు. అయితే ఇంకా భారీ వ్యయం చేయాల్సి ఉండగా పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం దృష్ట్యా ప్రభుత్వం మాటలు కాకుండా ఆచరణలో అధిక నిధులు కల్పించి సత్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న డిమాండ్ ప్రజల్లో అధికంగా ఉంది. ఈక్రమంలో పలు పార్టీలు, రైతుసంఘాలు కూడా ప్రభుత్వంపై వత్తిడికి సిద్ధమవుతున్నాయి. ఇదే అంశంపై గురువారం కనిగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటుచేయగా పార్టీ అగ్రనేత బీవీ రాఘవులు హాజరవుతున్నారు.

ఏలూరి జన్మదినోత్సవానికి ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న క్యాంపు కార్యాలయం
- 26న వైద్య శిబిరాలు
- పరిశీలించిన నాయకులు, కార్యాలయ ప్రతినిధులు



ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ప్రతినిధులు

పర్చూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల 26న విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు, పార్టీ శ్రేణులు వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం వేదికగా జన్మదిన వేడుకలను పలు సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు.

ఉచిత వైద్య శిబిరం

ఎమ్మెల్యే ఏలూరి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా గుంటూరు అమరావతి హాస్పటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ మెడిసన్, యూరాలజీ, నెఫ్రాలజీ, రేడియాలజీతోపాటు, ఎకో, స్కానింగ్ పరీక్షలతోపాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు.

మెగా కంటి వైద్య శిబిరం

నోవా అగ్రిటెక్, శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఏలూరి నాగేశ్వరరావ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

నియోజకవర్గ వ్యాప్తంగా 80 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ మూడు చక్రాల ట్రై సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. దీంతోపాటు వృద్ధులకు వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, మెడ పట్టీలు, నడుము పట్టీలను అందజేయనున్నారు.

మెగా రక్తదాన శిబిరం

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తెలుగు యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాటు చేశారు. 26 ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు రక్తదాన శిబిరం నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్ల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లాలో రూ.143కోట్లతో వసతిగృహాలకు మరమ్మతులు
- తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి
- అధికారులకు మంత్రి స్వామి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సంక్షేమ, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వసతిగృహల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.143కోట్లతో హాస్టల్ భవనాలకు మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఆ నిధులతో వెంటనే పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదవతరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చిన ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఖాళీలు ఉన్న హాస్టల్స్‌లో సామాజికవర్గంతో సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరుచేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులు పెన్షన్ల కోసం ప్రతినెల వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే డబ్బులు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. మాతా శిశు మరణాలు తగ్గించడంతోపాటు ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గుండెపోటు సంభవించినప్పుడు తక్షణమే ప్రమాదాన్ని నివారించేందుకు ఇంజెక్షన్ వేసి స్టెమీ ప్రాసెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగర్ జలాలు మరోసారి విడుదల చేయనున్నారని, వాటితో చెరువులను పూర్తిస్థాయిలో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి స్వామి ఆదేశించారు.

భవన నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్ నిధులు

వివిధ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులను తన ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయిస్తానని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మాగుంట ప్రస్తావించారు.

రిమ్స్‌పై వచ్చేనెలలో సమీక్ష

రిమ్స్ ఆస్పత్రిపై వచ్చేనెల మొదటివారంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. దాతల సహాయంతో ఆస్పత్రిని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. మోటార్లు పనిచేయకపోవడంతో మద్దిపాడు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని 50 గ్రామాలకు నీటి సరఫరాలో 17 రోజుల పాటు సమస్య వచ్చిందన్నారు. ఒంగోలు నగరపరిధిలో వినియోగించకుండా ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన 146 ఎకరాలను రెవెన్యూ శాఖకు బదలాయిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీలు పడిపోయాయి

మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఓపీలు భారీగా తగ్గిపోయాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గతంలో రోజుకు 800 ఓపీలు ఉండగా ప్రస్తుతం 200కు పడిపోయాయన్నారు. రోగుల పట్ల వైద్యులు శ్రద్ధపెట్టకుండా ప్రైవేటుగా ప్రాక్టీస్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరి వర్కర్‌ను ఏజెంట్‌గా పెట్టుకొని దివ్యాంగుల పెన్షన్ కోసం నకిలీ సర్టిఫికెట్లను మంజూరుచేస్తున్నారని మండిపడ్డారు. ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాగునీటి బోర్‌వెల్స్‌ను రిపేరు చేయాలన్నారు. పొదిలి ప్రాంతానికి వారానికి 30గంటల పాటు ఇస్తున్న నీటి సరఫరాను 48 గంటలకు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గైనకాలజిస్ట్ విధులు నిర్వహించడం లేదు

పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కనిగిరికి డిప్యుటేషన్‌పై వచ్చిన గైనకాలజిస్ట్ విధులు నిర్వర్తించడం లేదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. పామూరుకు కూడా తిరిగి రాలేదన్నారు. చెప్పకుండా విధులకు గైర్హాజరైన గైనకాలజిస్ట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏరియా ఆస్పత్రికి వైద్యులను నియమించాలి

గిద్దలూరులోని ఏరియా ఆస్పత్రిలో రేడియాలజిస్టు, పీడియాట్రిషియన్, అనస్తీషియా వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. ఆస్పత్రిలో ఉన్న నియోనాటల్ కేర్ యూనిట్‌ను స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కంభం ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో 500 అడుగుల కంటే లోతులో ఉన్న బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకొని అన్నింటికి మరమ్మతులు చేయాలని కోరారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి అనంతరాజు

అభివృద్ధి పనులపై సమీక్ష

పంగులూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకాధికారి అనంతరాజు బుధవారం శాఖాపరంగా సమీక్ష నిర్వహించారు. సామాజిక పించన్‌ల పంపిణీ తీరును, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఇంజనీరింగ్ విభాగంలో ఇప్పటి వరుకు గ్రామాలలో 5.6. కిలోమీటర్లు సీసీ రోడ్లను నిర్మించామని, 1.678 మీటర్లలో సైడ్ నిర్మాణాలు చేపట్టామని పీఆర్ ఏఈ హనుమంతరావు తెలిపారు. మండలంలో పెండిగ్‌లో ఉన్న హౌస్‌హోల్డ్ మ్యాప్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించి, పెండిగ్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోఆర్డీ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు శివయ్య, కిషోర్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధ మహిళలే టార్గెట్!

- మత్తుమందు ఇచ్చి దోపిడీలకు పాల్పడుతున్న కిలాడీ లేడీ అరెస్ట్
- నిందితురాలిపై ఏకంగా 11 కేసులు
- రూ.35లక్షల విలువైన బంగారపు సొత్తు స్వాధీనం
- ఎస్పీ దామోదర్ వెల్లడి

ఒంగోలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉంటున్న వృద్ధ మహిళలే ఆమె టార్గెట్. మాయ మాటలు చెబుతూ శీతలపానియాల్లో మత్తు మందు కలిపి ఇచ్చి తరువాత దోపిడీలకు పాల్పడటం ఆమె నైజం. అయితే ఈ కేసుల్లో కిలాడీ లేడీ ఇచ్చిన మత్తు మందు కారణంగా ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. మరో రెండు కేసుల్లో బంగారపు దుకాణాల్లో పట్టపగలు చోరీలకు పాల్పడింది. ఒంగోలులో నివాసం ఉంటూ ఏడాది కాలంగా ఎవరి కంటా పడకుండా పట్టపగలు గుట్టుగా దొంగతనాలకు పాల్పడుతోంది. ఈమేరకు దృష్టి సారించిన ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేక బృందాన్ని నియమించి ఆమె ఆట కట్టించారు. నిందితురాలిపై మొత్తం 11 కేసులు నమోదు చేశారు. 9 కేసులు మత్తు మందు ఇచ్చి చోరీలకు పాల్పడినవి కావడం గమనార్హం. బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో ఎస్పీ దామోదర్ వివరాలను వెల్లడించారు.

460 గ్రాముల బంగారం స్వాధీనం

ఒంగోలు రూరల్ మండలం దేవరంపాడుకు చెందిన గంటా ఎలీశమ్మ అలియాస్ గంధం సుజాత ప్రస్తుతం ఒంగోలు నగరం బాలాజీనగర్‌లో నివాసం ఉంటుంది. ఈక్రమంలో ఆమెను బుధవారం ఉదయం స్థానిక బాలాజీనగర్‌లో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య నేతృత్వంలో టంగుటూరు పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి 460 గ్రాములు బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.35 లక్షలు.

గతంలో జైలుకు వెళ్లి వచ్చి

నిందితురాలు సుజాత 2013లో ఓ దొంగతనం కేసులో విజయవాడలో అరెస్టు అయ్యి జైలుకు వెళ్లింది. అప్పటి నుంచి టీవీ సీరియల్స్‌కు ఆకర్షితురాలై వాటిని చూసి నిద్రమాత్రలు ఇచ్చి దొంగతనం చేయవచ్చని తెలుసుకుంది. దీనికితోడు ఆమెకు ఉండే అనారోగ్య కారణాలకు నిద్రమాత్రలు వాడుకుంటుంది. అవే మాత్రలను వృద్ధురాళ్ల ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పి శీతలపానియాల్లో కలిపి ఇచ్చి, బంగారం అపహరించుకుని వెళుతోంది. ఏడాదిగా టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు తాలుకా, వన్‌టౌన్, టూటౌన్, నాగులుప్పలపాడు, కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 కేసుల్లో మత్తు ఇచ్చి దొంగతనాలు, రెండు బంగారపు షాపుల్లో చోరీలకు పాల్పడింది.

ఇద్దరు వృద్ధ మహిళల మృతి

మాయలేడీ మత్తు మందు ఇచ్చి దోపిడీలకు పాల్పడిన ఘటనలలో ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందారు. త్రోవగుంటలో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుండగా ఆమెకు శీతలపానియంలో మత్తు మందు ఇచ్చి నిద్రలోకి జారుకున్న తరువాత బంగారపు ఆభరణాలు చోరీ చేసింది. అనంతరం ఆ వృద్ధురాలు మృతి చెందింది. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్ సమీపంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలికి మామిడికాయలో మత్తు వేసి తినిపించి ఆమె వద్ద ఉన్న బంగారపు నగలు అపహరించుకెళ్లింది. ఆ వృద్ధురాలు రెండు రోజుల అనంతరం మృతి చెందింది. ఆమె మృతికి కారణం మత్తుమాత్రలు అని డాక్టర్లు నివేదిక ఇచ్చారు.


తీరంలో సెల్ఫీలు తీసుకుంటున్న మహిళలు

తీరంలో జర జాగ్రత్త

చీరాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు జర జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే సమస్యలు తప్పవు. తీరంలో పలుచోట్ల తాగి పడేసిన మద్యం సీసాలు, భోజనాలు చేసి పడేసిన ప్లేట్లతో పలుచోట్ల అపరిశుభ్ర వాతావరణం నెలకుంటోంది. కొన్ని చోట్ల విసిరిపడేసిన మద్యం సీసాలు పగిలి కాళ్లకు గుచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని కొందరు చెప్తున్నారు. ఇది లావుంటే తీరంలో పర్యాటకుల భద్రత కోసం ఏర్పాటు చేసిన వాచ్‌టవర్లలో సిబ్బంది కనిపించడం లేదు. వీటిపై ఆయా పరిధుల్లో గ్రామ పంచాయతీల అధికారులు, రిసార్టుల నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటకులు కోరుతున్నారు.


తీరంలో ఉన్న వాచ్‌టవర్‌లో కనిపించని సిబ్బంది


తీరంలో తాగి పడేసిన మద్యం సీసాలు

మందుబాబులకు అడ్డా

ద్రోణాదుల పశువైద్యశాల

» ప్రాంగణంలో తాగిపడేసిన సీసాలు, గ్లాసులు

» గేట్ లేకపోవడమే కారణం


ప్రహరీ గేట్ లేని ద్రోణాదుల పశువైద్యశాల

మార్టూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల పశువైద్యశాల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారించి. పశువైద్యశాల ప్రాంతమంతా మందుబాబులు తాగిపడవేసిన మద్యం సీసాలు, గ్లాసులతో చిందరవందరగా ఉంది. పశు వైద్యశాల లోపలకు ప్రవేశించే ప్రధానగేట్ లేకపోవడంతో కొంతమంది మందుబాబులు మద్యంసీసాలతో వైద్యశాల ప్రాంగణాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారు. వారిని నిలదీసే వారే లేరు. పశువైద్యశాల పక్కనే మద్యం దుకాణం ఉండడంతో అక్కడ మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు రాత్రి సమయంలో పశువైద్యశాలలోకి వస్తున్నారు. పగలు మాత్రమే వైద్య సిబ్బంది ఉండడం రాత్రి సమయంలో ఎవరూ లేకపోవడంతో మద్యపానం సేవించేవారికి వైద్యశాల ప్రాంగణం అంతా అనుకూలంగా ఉంది. వారు తమ కార్యక్రమాన్ని ముగించుకున్న తర్వాత చెత్తాచెదారాన్ని అక్కడే వదిలివేసి వెళుతున్నారు. కనీసం వాటిని శుభ్రం చేసేవారు కూడా లేరు. ఈ విధంగా కాకుండా వైద్యశాల లోపలకు వెళ్లడానికి ఇనుప గేట్ ఉన్నట్లయితే కొంతమేర మందుబాబులను వైద్యశాల ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకట్టవేయవచ్చునని పశుపోషకులు అంటున్నారు. ఈ విషయమై కొంతమంది పశు పోషకులు మాట్లాడుతూ పగలు పశువులు ఆస్పత్రికి వస్తాయి, రాత్రి సమయంలో కొంతమంది మందుబాబులు పశువైద్యశాలకు వచ్చి మద్యం సేవిస్తుంటే అదేమిటని అడిగితే పశువుల్లాగా ప్రవర్తిస్తారు దాంతో మేమేం మాట్లాడగలమంటూ అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.


ఆవరణలో పడిఉన్న మద్యం సీసాలు

26న సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 76వ గణంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన కమతేశ్వరస్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరుగుతుందని సృజన సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పెద్దన కవితా వైభవం - మనుచరిత్ర అనే అంశంపై ఉపన్యాసం, విశ్రాంత వీరసైనికుకునికి సన్మానం జరుగుతుందని తెలిపారు. అనంతరం దేశభక్తి కవితలతో కూడిన కవి సమ్మేళనం ఉంటుందని వారు తెలిపారు.


అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

సొంతింటి కలను సాకారం చేస్తాం

టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాల), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పరంగా అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చెప్పారు. మండల పరిధిలోని అబ్దుల్ కలామ్ కాలనీ వాసులు పలువురు కొత్తపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద డాక్టర్ మహేంద్రనాథ్‌ను కలిశారు. తమకు సొంతింటి నిర్మాణాలకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతాక్రమంలో సొంతింటి కలను సాకారం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం గుర్తింపుపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు ఆర్కే నాయుడు

వేటపాలెం(చీరాల), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందడం హర్షనీయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. దేశాయిపేట పంచాయతీ పరిధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు జనసేన పార్టీ నాయకులు మాట్లాడారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిబద్ధతకు ఇదొక నిదర్శనమన్నారు. స్వీట్లు పంచారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణం


అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ

అద్దంకి, జనవరి 22 ఆంధ్ర జ్యోతి) : అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం శింగరకొండ సమీపంలోని 99 అడుగుల ఆంజనేయస్వామి వి గ్రహం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా శ్రీపతి రంగనాథాచార్యులు, గౌరవ అధ్యక్షుడిగా హనుమంతరావు, సహాధ్యక్షుడిగా వామరాజు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పంచాగ్నుల సత్యనారాయణ, ఈదర వెంకట శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కారుమంచి వెంకటరమణరావు, కోశాధికారిగా లక్కరాజు విశ్వమోహన్, కోఆర్డినేటర్‌లుగా పుట్టంరాజు సాయి, బాలాజీతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వేదపండితుడు వంగల హరిశంకర అవదాని, స్వర్ణ సుబ్బారావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

ముండ్లమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీంద్రబాబు అనే బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద బుధవారం ఎస్‌ఐ వై నాగరాజు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా 25 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పున్నారావు, మరియబాబు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


దూడకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యులు

చీరాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పశు వైద్య శిబిరాలను పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి. వేణుగోపాల్ అన్నారు. మండల పరిధిలోని కావూరివారిపాలెంలో బుధవారం పశు వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ పోషకులు పాటించాల్సిన మెళకువలను వివరించారు. పశు పోషకుల సందేశాలను నివృత్తి చేశారు. అనంతరం గేదెలు, దూడలు, గొర్రెలకు అవసరమైన పరీక్షలు చేశారు. తదనంతరం పాడి రైతులకు లివర్ టానిక్, ఖనిజ లవణ మిశ్రమ దాణాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చిట్టిబాబు, పశు వైద్యాధికారి డాక్టర్ వై. పావని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధ్యం అవుతుందని పశు వైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని చక్రాయపాలెంలో బొమ్మనంపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్యం శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏడి డాక్టర్ మోహనరావు పరిశీలించారు. పశువులకు గర్భకోశ వ్యాధులు, తిరగ కట్టడం, యదకు రాకపోవడం తదితర సమస్యలతో ఉన్న పశువులను పరీక్షించారు. పశువులు, గొర్రెలకు మందులను అందజేశారు. కార్యక్రమంలో పశు సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : పశువుల సంరక్షణలో పోషకులు తగిన శ్రద్ధ చూపాలని పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ కోరారు. మండలంలోని పంగులూరు, చందలూరు గ్రామాలలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గొర్రెలు, దూడలకు నట్టల నివారణ మందు తాగించడంతో పాటు గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించారు. ఎద ఇంజక్షన్లు చేశారు. పశు సంరక్షణలో వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సైదయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాలలోనే అందుబాటులో పశు వైద్యం అందించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని పశు వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో అరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా రెండు గ్రామాలలోని 65 దూడలకు, 51 గేదెలకు, 180 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేశారు. 26 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామాలలో జరిగే వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియెగం చేసుకోవాలన్నారు.


కొప్పెరపాడులో పోషకులకు మందులను అందజేస్తున్న వైద్యాధికారి పావనీకుమారి


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వరరావు

బస్టాండ్ల అభివృద్ధి బాధ్యత డిపో మేనేజర్లదే

» నెల్లూరు ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వరరావు

ఇంకొల్లు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్లలో మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత డిపో మేనేజర్లదేనని నెల్లూరు ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం ఇంకొల్లు బస్టాండ్‌ను పరిశీలించారు. ఇంకొల్లు బస్టాండ్ ఆవరణలో జరుగుతున్న మరుగుదొడ్ల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న ప్యాచ్‌వర్కులను వెంటనే చేయాలన్నారు. నూతన బస్టాండు ఎదురుగా సీసీ రోడ్డు నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఒంగోలు డీఈ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసరావు,కాంట్రాక్టరు నరసయ్య, మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు మోహనకృష్ణ, కంట్రోలర్‌బాబు ఉన్నారు.

మత్స్యకార సంక్షేమ సమితి మండల కమిటీ ఎంపిక


వేటపాలెం(చీరాల), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార సంక్షేమ సమితి మండల కమిటీను బుధవారం ఎంపిక చేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు కె.అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

హమ్మయ్య డబ్బా ఊడింది

శునకానికి నరకయాతన నుంచి విముక్తి


భవానీసెంటర్‌లో కుక్క మూతికి ఉన్న డబ్బాను తొలగిస్తున్న జంతు ప్రేమికుడు సుబ్బారావు

అద్దంకి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆకలి తీర్చుకునేందుకు దబ్బాలో ఏదో ఉందని ఆశగా మూతి పెట్టిన శునకం గత వారం రోజులుగా నరకయాతన అనుభవిస్తుంది. పట్టణంలోని భవానీసెంటర్‌లో ఓ కుక్క వారం రోజుల నుంచి మూతికి డబ్బా ఇరుక్కొని ఎలాంటి ఆహా రం తినే అవకాశం లేకుండా పోయింది. కడుపు నింపుకునేందుకు చేసిన ప్రయత్నం చివరకు కడుపు మాడ్చుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానికులు శునకం పడుతున్న నరకయాతన ను గమినించి జంతు ప్రేమికుడు, హరహర గోకులం నిర్వాహకుడు గోను గుంట సుబ్బారావుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. బుధవారం సుబ్బారావు భవానీసెంటర్‌లో శునకం మూతికి ఉన్న డబ్బాను తొలగించారు. దీంతో ఆ నరకయాతన నుంచి కుక్కకు విముక్తి కలిగింది. సుబ్బారావును స్థానికులు అభినందించారు.


డబ్బా తొలగించిన తరువాత స్వేచ్ఛగా ఉన్న కుక్క

పంట నమోదు చేసుకోవాలి

చినగంజాం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న ప్రతి పంటను రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.భాస్కరావు సూచించారు. బుధవారం మండలంలోని చింతపల్లి, కడవకుదురు గ్రామాల్లో శగన పంటను ఏవో పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపంట నమోదైన వారికి మాత్రమే ప్రభుత్వ లబ్ధి చేకూరుతుందన్నారు. శనగలో తుప్పు, కాటుక తెగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు హెక్సాకోనజోల్, టెబుకోజోల్ మందును పిచికారీ చేస్తేత ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సంధ్య, కిషోర్, రైతులు పాల్గొన్నారు.


దాతలు సమకూర్చిన ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు గ్రామర్ పుస్తకాల పంపిణీ

పంగులూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆరవ తరగతి విద్యార్థులకు టైమ్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు బహూకరించారు. తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు పూనాటి రవీంద్ర, తాటి సరోజిని విద్యార్థులకు గ్రామర్ పుస్తకాలు సమకూర్చారు. ప్రతి ఏటా తమ పాఠశాల బాలబాలికలకు గ్రామర్ పుస్తకాలు సమకూరుస్తున్న ట్రస్ట్ ప్రతినిధులకు పాఠశాల హెచ్.యం. వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు వచ్చేలా సాగు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రవీంద్ర

బల్లికురవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయం చేయాలని సమీకృత వ్యవసాయ డీపీఎం రవీంద్ర అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘాల బోర్డ్ అఫ్ డైరెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి రైతులకు మెరుగైన వ్యవసాయం చేసేలా అన్ని గ్రామాలలో చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో రైతులు, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

ముడిరాయి లారీని పట్టుకొన్న అధికారులు

బల్లికురవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పర్మిట్ లేకుండా అక్రమ మార్గంలో తరలి వెళుతున్న గ్రానైట్ ముడిరాయి లారీని బుధవారం మైనింగ్ విజిలెన్స్ అర్ఐ రాజు అదుపులోకి తీసుకున్నారు. వేమవరం సమీపంలో పర్మిట్ లేకుండా వెళ్తున్న లారీని తనిఖీ చేసి వెంటనే పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

పట్టపగలు చోరీ

» రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉన్న కారు అద్దం పగులగొట్టి నగదు, ల్యాప్‌ట్యాప్ చోరీ

» పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం


అద్దం పగులగొట్టి ఉన్న కారు

మార్టురు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో బుధవారం పట్టపగలు దొంగలు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడారు. నిలిపి ఉన్న కా రు అద్దం పగులగొట్టి అందులో ఉన్న రూ.1.20లక్షల నగదు, ల్యాప్‌టాప్, పలు పత్రాలను చోరీ చేశారు. బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి మాలపాటి పోతురాజు బుధవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న సర్వీసు రోడ్డులో కారును నిలిపి ఎదురుగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకి వెళ్లి వచ్చే సరికి కారు ముందు భాగంలో ఉన్న ఎడమ వైపు అద్దాన్ని పగులగొట్టి కింద ఉన్న బ్యాగులో నగదును, ల్యాప్ ట్యాప్‌ను, చెక్కు బుక్‌తోపాటు విలువైన డాక్యుమెంట్లను దొంగిలించారు. పట్ట పగలు ప్రజలు తిరిగే సర్వీసు రోడ్డులో కారు అద్దం పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వెంటనే వైద్య శాల లోపలి నుంచి వచ్చిన వ్యాపారి పోతురాజు కారు అద్దం పగిలి ఉండటం చూసి వెంటనే లోపల ఉన్న బ్యాగు కోసం చూడగా చోరీ జరిగిందని గ్రహించి వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఇన్‌చార్జి సీఐ వెంకట్రావు చోరీ జరిగిన కారును పరిశీలించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలి ముద్రలను పరిశీలించారు. వ్యాపారి పోతురాజు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మహబూబ్‌బాషా కేసు నమోదు చేశారు.

బంగారు ఆభరణాల చోరీ

» రోల్డు గోల్డ్ వస్తువులతో మోసం

» మహిళను పోలీసులకు అప్పగించిన దుకాణ యజమానులు


అద్దంకి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బంగారు వస్తువులు కొనుగోలు కోసమని గోల్డ్ షాపులకు వచ్చి రోల్డ్ గోల్డ్ వస్తువులు బాక్స్‌లో పెట్టి, అందులో ఉండే బంగారు వస్తువులను అపహరించే మహిళను గోల్డ్ షాపుల నిర్వాహకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు కొరిశపాడుకు చెందిన దుర్గాభవాని మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో రామాటాకీస్ బజారులో హనుమాన్ జ్యువెలరీస్‌కు వెళ్లి ఆరున్నర గ్రాముల కమ్మలు తీసుకొని ఆ బాక్స్‌లో రోల్డ్ గోల్డ్ కమ్మలను పెట్టి వెళ్లిపోయింది. కొద్దిసేపటి తరువాత రోల్డ్ గోల్డ్ కమ్మలను గుర్తించిన షాపు యజమాని ఎం.గోపాలకృష్ణ మహిళ కోసం వెతికారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మహిళను గుర్తించి పోలీస్‌లకు అప్పగించారు. పోలీస్‌లు విచారించగా గతంలో మరో దుకాణంలో కూడా ఇదే విధంగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుంది. గతంలో చోరీ చేసిన 12గ్రాముల బంగారం వస్తువులను కొరిశపాడులోని బ్యాంక్ లో పెట్టి డబ్బులు తీసుకుంది. మహిళపై కేసు నమోదు చేసి పెద్దెనిమిదిన్నర గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.


వాహనదారులకు తీరనున్న ఇక్కట్లు

ఎమ్మెల్యే ఆదేశాలతో శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు

అడుసుమల్లి(పర్చూరు), జనవరి 22 : పర్చూరు - గుంటూరు రోడ్డులోని అడుసుమల్లి జడ్పీ హైస్కూల్ సమీపంలోని కల్వర్టుపై రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో రాకపోకల సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే కల్వర్టుపై వాహన దారులు పడుతున్న అవస్థలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. కల్వర్టుపై రోడ్డు నిర్మాణాన్ని ఏర్పాటు చేసే విధంగా అధికారులను ఆదేశించారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అడుసుమల్లి వద్ద కల్వర్టుపై జరుగుతున్న రోడ్డు పనులు







అందరి దృష్టి రెడ్‌క్రాస్‌పైనే!

- ఐదుగురు సభ్యుల తొలగింపు
- కలెక్టర్ నిర్ణయంపై ఇద్దరు హైకోర్టుకు..
- నేడు పది మంది సభ్యులతో చైర్మన్ ఎంపిక
- వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు?

- వివరాలు 6లో..

ఎవరు.. ఏమిటి!?

- ఫ్రీహోల్డ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి
- 14,834 ఎకరాలు అక్రమంగా తొలగించినట్లు నిర్ధారణ
- వాటన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశం
- వేగంగా జరుగుతున్న ప్రక్రియ
- మరికొంతకాలం రిజిస్ట్రేషన్ల బంద్

వివరాలు 6లో..

ఫ్రీహోల్డ్ మాటున వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లా అధికారులు విచారణలో గుర్తించిన అక్రమాలన్నిటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విచారణ నివేదికలను తారుమారు చేసే అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఆన్‌లైన్ పూర్తికాగానే నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఈ భూముల రిజిస్ట్రేషన్లను కూడా బంద్ చేసింది. మరో రెండు నెలలపాటు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు అందాయి.





నెల్లూరు : పొట్టేపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్ వద్ద హాల్‌టికెట్ల నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 1200 మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 30వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయ, మధ్నాహ్నం రెండు బ్యాచ్‌లుగా ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు 1200 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని కేంద్రాల్లో మెటల్ డిటెక్టర్‌లతో క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం విద్యార్థుల నుంచి బయోమెట్రిక్ నమోదు చేసుకుని పరీక్ష హాలులోకి అనుమతించారు.



కేంద్రం వెలుపల తల్లిదండ్రుల నిరీక్షణ

రైల్వే అండర్‌పాస్ పనుల ప్రారంభం

- నాలుగు నెలల్లో పూర్తికి కసరత్తు
- ఆ తర్వాత రంగనాయకులపేట వద్ద..
- ఈ రెండింటికి రూ.19 కోట్ల మంజూరు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ప్రధాన రైల్వే గేట్లు ఉన్న రంగనాయకులపేట, శెట్టిగుంటరోడ్డు ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు రానున్నాయి. ఇప్పటికే రైల్వేశాఖ వీటి నిర్మాణాలకు రూ.19 కోట్లు మంజూరు కాగా, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. అయితే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మొదట శెట్టిగుంటరోడ్డు రైలుగేటు ప్రాంతంలో అండర్‌పాస్ పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 6 నెలల క్రితమే ఇక్కడ రైల్వేగేటు మూసివేయగా, ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. డబుల్ రోడ్డు నిర్మాణంతో నాలుగు నెలల్లో ఈ అండర్‌పాస్ పూర్తిచేస్తామని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది పూర్తయ్యాకే రంగనాయకులపేట రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభమవుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే త్వరగా రెండు అండర్ పాస్‌ల నిర్మాణాలు పూర్తవుతాయి.



శెట్టిగుంటరోడ్డు రైల్వేగేటు ప్రాంతంలో జరుగుతున్న అండర్‌పాస్ పనులు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

- వివరాలు 7లో

బుచ్చిలో 19 అనధికార లేఅవుట్లు

- వివరాలు 6లో





మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న సాయుధ బలగాల సిబ్బంది

సాయుధ బలగాల వార్షిక సమీకరణ ప్రారంభం



ప్రారంభోపన్యాసం చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సాయుధ బలగాల సిబ్బంది వార్షిక సమీకరణ రీఫ్రెష్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. దీనిని ఎస్పీ జీ కృష్ణకాంత్ నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానంలో ప్రారంభించారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా సాయుధ దళ పోలీసుల సేవలు పోలీసు శాఖకు ఎంతో కీలకమన్నారు. పోలీసు శాఖలో చోటుచేసుకుం టున్న నూతన మార్పులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిం చుకొని మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. సాయుధ దళ పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహార పు అలవాట్లు, వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడు కుంటూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసం, సైబర్ నేరాలపై అవగాహన, ఆర్థిక స్థితులను మెరుగుపర్చేందుకు మొబిలైజేషన్ ఉపయోగ పడుతుందని చెప్పారు. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ, ఫైరింగ్ డ్రిల్, మార్చ్ పాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ ఎస్కార్ట్, పీఎస్‌వో, బందోబస్త్ ఇలా అనేక అంశాల గురించి పూర్తి అవగాహన పొందాలంటూ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, గట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ వార్షిక సమీకరణ కార్యక్రమం 12 రోజులు కొనసాగనుంది.

- నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి



వాద్య పరికరాలు వాయిస్తూ...

ఎవరు.. ఏమిటి!?

- ఫ్రీహోల్డ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి
- 14,834 ఎకరాలు అక్రమంగా తొలగించినట్లు నిర్ధారణ
- వాటన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశం
- వేగంగా జరుగుతున్న ప్రక్రియ
- మరికొంతకాలం రిజిస్ట్రేషన్ల బంద్


నెల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ పేరుతో వేల ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అందులో అసైన్‌మెంట్ భూములు, చుక్కల భూములు, సర్వీసు ఈనాం భూములు ఉన్నాయి. మొత్తంగా 98,785.51 ఎకరాలను ఫ్రీహోల్డ్ మాటున 22-ఏ జాబితా నుంచి బయటకు తీసి వాటికి పట్టా భూములతో సమానంగా హక్కులు కల్పించారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు, చుక్కల భూములు 43,270.93 ఎకరాలు, సర్వీస్ ఈనాం భూములు 67.58 ఎకరాలు ఉన్నాయి. అయితే ఫ్రీహోల్డ్ మాటున నాడు వైసీపీ నేతలు భారీ కుంభకోణానికి తెరలేపారని మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. నాడు ప్రతిపక్ష నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. పేదల భూములను దొడ్డిదారిలో అధికార బలం ఉన్న వారు స్వాహా చేశారు. వీటిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. జాయింట్ కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకూ అందరూ ఫ్రీహోల్డ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అక్రమాలను గుర్తించారు. మొత్తంగా 14,552.87 ఎకరాల అసైన్‌మెంట్ భూములు, 281.62 ఎకరాల చుక్కల భూములను నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తేల్చారు. ఇలా తొలగించిన 14,834 ఎకరాల విలువ రూ.వందల కోట్లలోనే ఉంటుందని అంచనా. ఈ భూముల్లో సుమారు 300 ఎకరాల వరకూ రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు నిర్ధారించారు. ఈ నివేదికలను గత నవంబరులో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

సీసీఎల్ఏ కీలక ఆదేశాలు

విచారణ నివేదికలను పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు... ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరగడంతో నివ్వెరపోయారు. ఈ క్రమంలో ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్రీహోల్డ్ భూముల విచారణ నివేదికలపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అవకతవకలు జరిగిన భూముల పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయాలని సీసీఎల్ఏ ఆదేశించారు. దీంతో మండల స్థాయిలో ఈ వివరాలన్నింటినీ ప్రస్తుతం ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇది పూర్తయ్యాక ఈ భూములపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేశారు. అయితే ఇప్పుడు విచారణ పూర్తవడం, భారీగా అక్రమాలు తేలడంతో తదుపరి చర్యలు తీసుకునే వరకూ రిజిస్ట్రేషన్లను ఆపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. మరో రెండు నెలలపాటు రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయినట్లు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు బాధ్యులెవరు?

ఫ్రీహోల్డ్ మాటున అక్రమాలు జరిగినట్లు ఇప్పుడు తహసీల్దార్లు, ఆర్డీవోలు నిగ్గు తేల్చారు. మరి ఇదే తహసీల్దార్లు గత ప్రభుత్వంలో కూడా జిల్లాలోనే పనిచేశారు. పైగా నాడు ఫ్రీహోల్డ్ అర్హత వెరిఫికేషన్ చేసింది కూడా ఈ తహసీల్దార్లే కావడం గమనార్హం. మరి నాడు ఎందుకు తహసీల్దార్లు అక్రమాలను అడ్డుకోలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. వీఆర్వో దగ్గర నుంచి కలెక్టర్ వరకూ అనేకమంది నాడు సంతకాలు పెట్టి జాబితాను ఆమోదించారు. మరి వీరిలో ఎవరి పాత్ర ఎంత..? అన్నది తేలాల్సి ఉంది. అందులోనూ ఫ్రీహోల్డ్ జాబితాలను కలెక్టరేట్‌లో రీవెరిఫికేషన్ చేశారు. మండలాల నుంచి వచ్చిన జాబితాలను సరిచూసుకోవాల్సిన బాధ్యత కలెక్టరేట్‌లోని సంబంధిత సెక్షన్‌పై ఉంది. మరి వారెందుకు ఈ అవకతవకలు గుర్తించ లేకపోయారన్నది కూడా అనుమానంగా మారింది. మొత్తంగా ప్రభుత్వం తదుపరి ఎటువంటి చర్యలకు ఉపక్రమిస్తుందన్నది ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



రవి అనే యువకుడు బైకుపై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, వాహనదారులు ఈ సంఘటన ఎలా జరిగింది? తప్పెవరిది అని చర్చించుకుంటున్నారే తప్ప ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న రవిని ఆసుపత్రికి తరలిద్దామనే ఆలోచన చేయలేదు. ఈలోపు ఓ వ్యక్తి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే అక్కడకు చేరుకున్న అంబులెన్స్ క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకుంటున్నాడు. కాగా, సకాలంలో స్పందించి ఆ యువకుడిని కాపాడిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదు అందింది.

స్పందిస్తే.. మీరే ప్రాణదాతలు!

- క్షతగాత్రులను బతికిస్తే ప్రోత్సాహం
- ఆత్మసంతృప్తితోపాటు ఆర్థిక చేయూత

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. సకాలంలో వైద్యం అందకే 50 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. కళ్లెదుటే ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడి వారిని ఆసుపత్రికి తరలించేందుకు ఎవరూ పెద్దగా ముందుకురారు. మరి కొందరికి బాధితులను బతికించాలని ఉన్నా ఏదైనా జరి గితే కేసుల్లో ఇరుక్కుంటామని, అందరికీ సమాధానం చెప్పాల్సి వస్తుందని వెనక్కి తగ్గుతున్నారు. ప్రజల్లో ఇలాంటి భయాలను పోగొట్టడానికే కేంద్ర ప్రభుత్వం 2021, అక్టోబరులో 'గుడ్ సమరిటన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథ కం అమలుకు జిల్లా స్థాయిలో ఏర్పడిన కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. అయితే ఈ పథకం ప్రచారం లేకపోవడంతో ప్రజలకు అవగాహన కొరవడింది. క్షతగా త్రులను తక్షణం ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడితే ఈ పథకం కింద రూ.5 వేలు ప్రోత్సహకాన్ని అందిస్తోంది. తాజాగా ప్రోత్సాహకాన్ని రూ.25 వేలకు పెంచింది.

ఆ గంటే కీలకం

ప్రమాదాల్లో గాయపడిన వారిని మొదటి గంట లోపు ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు. ఎంతో కీలకమైన ఆ గంటను గోల్డెన్ అవర్ అని పిలుస్తారు. ఇలా ప్రాణా లను కాపాడే వారికి తాజాగా ప్రోత్సాహకాన్ని రూ. 25 వేలకు పెంచుతున్నట్లు కేంద్రమంత్రి గడ్కరి ఇటీవల ప్రకటించారు.

పథకం అమలు ఇలా..

రహదారులపై జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపా డిన వారికి రూ.25 వేల గుడ్ సమరిటన్ కింద అందు తుంది. ఇది పొందాలంటే క్షతగాత్రుడిని గంటలోపు ఆసు పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారు ప్రాణదాత అంటూ ప్రమాద వివరా లతో కూడిన లేఖను ఇస్తారు. ఆ తర్వాత పోలీసులే ప్రాణదాత వివరాలను కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు పంపుతారు. పూర్తి వివరాలు సేకరించి కమిటీ చైర్మన్ ప్రాణదాతకు నగదుతోపాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో ఐదుసార్లు ఈ అవార్డు పొందవచ్చు. వ్యక్తిగత వివరాలు, డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపో వచ్చు. ఎవరి నుంచి వేధింపులు లేకుండా కమిటీ రక్షణ కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపా డిన పది మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందజేస్తారు.



మీ కోసం MEE KOSAM

ప్రాణదాతలకు ప్రోత్సాహం



రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రు లకు సకాలంలో అత్యవసర వైద్యం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రులను కాపాడ టాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలి. అలా కాపాడేవారిని ప్రాణదాతలుగా గుర్తించి ప్రభుత్వం పోత్సహిస్తోంది. కేసులో సాక్షిగా చేర్చి కోర్టులు, స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని భయం లేదు.

- జీ గంగాధర్, సీఐ, ఆత్మకూరు



రియల్టర్ల సమావేశంలో గుంటూరు టౌన్ ప్లానింగ్ అధికారులు, బుచ్చి చైర్ పర్సన్, కమిషనర్

బ్లాక్‌లిస్టులో 19 లేఅవుట్లు ?

- సబ్ రిజిస్ట్రార్‌కు నుడా నోటీసులు
- లేఅవుట్ల రూల్స్ మారాయన్న టౌన్ ప్లానింగ్
- రియల్టర్లతో గుంటూరు టీపీవోల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి22(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగరపంచాయతీలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 19 లేఅవుట్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశిస్తూ నుడా వైస్ చైర్మన్ బుచ్చి సబ్ రిజిస్ట్రార్‌కు మూడురోజుల క్రితం నోటీసులు జారీ చేశారు.అయితే లేఅవుట్ల ఏర్పాటులో రూల్స్ మారాయని బుధవారం గుంటూరు టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు, స్థానిక రియల్టర్లు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిలతో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఈనెల 11న జారీ చేసిన కొత్త జీవో నెంబరు మూడు ప్రకారం నగర పంచాయతీలో మూడు ఎకరాల్లోపు ఏర్పాటు చేసే లేఅవుట్లకు నగర పంచాయతీ, అంతకు మించి ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తే గుంటూరు టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు పొందాలని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో రియల్టర్ల తరఫున టీపీవోలకు తమ సమస్యలను రియల్టర్ గుత్తా శ్రీనివాసులు వివరించారు. నగర పంచాయతీతో సంబంధంలేని నుడా, సబ్‌రిజిస్ట్రార్‌కు ఇచ్చిన నోటీసులను రద్దుచేయాలని, రద్దు చేయకుంటే ఆ లేఅవుట్లకు సంబంధించి ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు, ప్లాట్లు అమ్ముకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని విన్నవించారు. ఈ సమావేశంలో పలువురు రియల్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి రూ. 326 కోట్ల రాయితీ రుణాలు

- ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం) జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మైనార్టీల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.326 కోట్ల రాయితీ రుణాలు ఇచ్చిందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో తెలియచేశారు. 50 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలు 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,426 మందికి మొత్తం 49,218 మందికి ఈ రునాలు అందనున్నాయని తెలిపపారు. 1500 మందికి రూ.లక్ష లోపు రుణాలు, 3040 మందికి రూ. లక్ష నుంచి 3 లక్షల వరకు, 1525 మందికి రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు, 225 మందికి రూ.8లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కింద టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిల్లో 3,428 మందికి ఎంపవర్మెంట్, కింద ఆటోమొబైల్ సెక్టార్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర వాటిల్లో వెయ్యిమంది మైనార్టీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియచేశారు.



ఇండియన్ రెడ్‌క్రాస్ కమిటీ జిల్లా కార్యాలయం

అందరి దృష్టి రెడ్‌క్రాస్‌పైనే!

- ఐదుగురు సభ్యుల తొలగింపు
- కలెక్టర్ నిర్ణయంపై ఇద్దరు హైకోర్టుకు..
- నేడు పదిమంది సభ్యులతో చైర్మన్ ఎంపిక
- వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు?

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మొన్న చైర్మన్ రాజీనామా తాజాగా ఐదుగురు సభ్యులపై వేటు వంటి ఘటనలతో అందరి దృష్టి ఇండియన్ రెడ్‌క్రాస్ పైనే నెలకొంది. గత వైసీపీ హయాంలో పాలకవర్గం సభ్యులతోపాటు చైర్మన్ ఎన్నిక వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల రాజనామా చేశారు. అలాగే, వైసీపీతో సంబంధం ఉన్న ఐదుగురు సభ్యులకు కలెక్టర్ ఆనంద్ ఈ నెల 11వ తేదీన నోటీసులు జారీ చేశారు. వివరణ ఇచ్చేందుకు 17వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అయితే వారి నుంచి సరైన సమాధా నం రాకపోవ టంతో ఆ ఐదు గురిని కమిటీ నుంచి తొలగిస్తున్నట్లు మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కమిటీలో కీలకంగా ఉన్న కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు ఎంవీ సుబ్బారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులపై వేటు పడింది. కాగా, కలెక్టర్ నోటీసులపై ఇప్పటికే ఇద్దరు సభ్యులు హైకోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆదిలోనే వివాదాలు

2023, ఏప్రిల్ 2వ తేదీన రెడ్‌క్రాస్ ఎన్నికలు జరగ్గా, 4వ తేదీన చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారిని ఎన్నుకున్నారు. అయితే, అప్పటికే ఎమ్మెల్సీగా ఎన్నికయిన చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ఎన్నికలలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం 4వేల సభ్యత్వాలు ఉన్న రెడ్‌క్రాస్ ఓటర్ల స్థానంలో తనవారిని ఎక్కువగా జీవిత కాల సభ్యులుగా చేర్చి 7,704 మందిని చేర్చడంపై అనేక ఆరోపణలు వినిపించాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 4,780 మంది సభ్యులుగా ఉండ టంపై విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో వైసీపీ అధికా రంలో ఉండటంతో కొందరు కోర్టుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. గతేడాది ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటంతో రెడ్‌క్రాస్ పాలకవర్గ ఎంపికపై దృష్టి సారించింది. నిబంధలు పక్కాగా అమలు చేయడంతో చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులపై వేటు పడింది.

నేడు కొత్త చైర్మన్ ఎన్నిక

ఇదిలా ఉంటే గురువారం కలెక్టర్ ఆనంద్ చాంబర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి ఎన్నిక జరుగుతుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ నోటీసులు కూడా అందచేశారు. రెడ్‌క్రాస్‌లో మొత్తం 15 మంది సభ్యులు ఉండగా, ఐదుగురిని తొలగించడంతో మిగిలిన 10 మంది సభ్యులు నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. 10 మందిలోనూ ఒకరు అందుబాటులో లేకపోవడంతో 9 మంది సభ్యులు మాత్రమే చైర్మన్ ఎన్నికలో అవకాశం ఉంది. కాగా, కమిటీలోని సభ్యులంతా వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమిత్ షా రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నాయకుల ఆందోళన

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బుధవారం నెల్లూరు లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాం గ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్ మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామ న్నారు. బీజేపీ ప్రభు త్వం కాంగ్రెస్ పార్టీ త్యాగాలను ఓర్చుకోలేక బురదజల్లే కార్యక్రమం చేపడుతోందని విమర్శించారు. జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఏటూరు శ్రీనివాసు లురెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఈ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నా యని చెప్పారు. కార్యక్ర మంలో నాయకులు సురేష్‌బాబు, తిరుపతయ్య, బాలసుధాకర్, ఫయాజ్, కల్యాణి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490 336550ను సంప్రదించాలన్నారు.

108 వాహనాల్లో ఈఎంటీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 29వ తేదీ లోపు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలోని 108 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చేసినవారు దరఖాస్తు చేసుకునేందకు అర్హులని, పూర్తి వివరాలకు 8328461648, 9642027098 నెంబర్లుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఇతర కులాలను ఎస్సీల్లో చేర్చారు!

అల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఇతర కులాలవారిని ఎస్సీల్లో చేర్చారని, తొలగించమంటే అధికారులు చోద్యం చూస్తున్నారని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరు, విడవలూరు, బోగోలు మండలాల్లోని దాదాపు 30 వేలమంది శంభన్ కులస్థులను ఎస్సీల్లోకి చేర్చారని తెలిపారు. వారిని తొలగించాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. ఎస్సీల్లో అక్రమంగా చేర్చిన శంభన్ కులస్థులను తొలగించి నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు.

పదో తరగతి పరీక్షల్లో

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను అందచేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాలరెడ్డి తదితరులు

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదవ తరగతిలో వందశాతం ఉతీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఎంపీపీ కేతా వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌కు కీలక మలుపు పదోతరగతి ఉత్తీర్ణతేనని, ఉపాధ్యాయుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జి బుజ్జిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ తహసీన్ సుల్తానా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చీడపీడల నివారణ

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చీడపీడలను సులువుగా నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారిణి డీ ధనమ్మ తెలిపారు. మండలంలోని కొండముడుసుపాలెం, కంచరగుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధరకాల పైర్లలో రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ నిర్మూలనకు 100 లీటర్ల నీటికి లీటరు వేపనూనె, ఆరు కోడిగుడ్లు, 100 గ్రాముల కుంకుడుకాయ రసం కలిపి పిచికారి చేస్తే సమర్థవంతంగా నిర్మూలన అవుతుందని ఎర్రనల్లి నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీ రాము, వ్యవసాయ సహాయకులు ఎల్. రమాదేవి, కే శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●కావలి రూరల్ : రైతులు ఏ పంటలు సాగుచేసినా ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పీ సత్యవాణి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకున్నామన్నారు. ధాన్యం సేకరణకు పంట నమోదు తప్పనిసరి అని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, నాగరాజు, ఉద్యానవనశాఖ అధికారి సుధామయి. ఏవో లలిత, వీఏఏలు, పాల్గొన్నారు.

●అల్లూరు : వరిపైరు పొట్టదశలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గ్రద్దగుంటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు సూచనలిచ్చారు. పొట్ట దశలో చేపట్టాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిశీలన

సీతారామపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని తొట్టిలలో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం బసినేనిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి జీవన్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ గోపి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సీతారామపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌డిఏ ఈవో శ్రీనివాసులు కోరారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో బుధవారం ఉదయగిరి వెటర్నరీ ఏడి శశిధర్, డిఎల్‌డిఏ ఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గోకుల మిషన్ కింద ఖనిజ లవణ మిశ్రమాన్ని పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ చంద్రయ్య, విఏ మాలశ్రీ , ఏహెచ్ఏ విజయ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తలుపూరుపాడులో...

● సంగం : మండలంలోని తలుపూరుపాడులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, స్థానిక సర్పంచ్ నాజ్మున్నీ, టీడీపీ నాయకులు బాబు, ఖాదర్‌బాషా, పాడి రైతులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు 'ప్రకాశం' విద్యార్థులు

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 26న జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థినులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థినులు సీహెచ్ వెంకటశ్రావణి, పొల్లూరి గాయత్రి పరేడ్‌కు ఎంపికయ్యారని, ఇది తమకెంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని టెక్నికల్ డైరెక్టర్ కే విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్లు షేక్ హిమామ్‌షా, సంతోష్ అభినందించారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి



కందుకూరు: గిడుగు రామ్మూర్తికి నివాళు లర్పిస్తున్న అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రతినిధులు

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు గొప్ప సాహితీవేత్తేకాక, వ్యవహారిక భాషోద్యమ పితామహుడని పలువురు వక్తలు కొనియాడారు. గిడుగు 85వ వర్ధంతిని బుధవారం అన్నమయ్య సాహిత్య సేవా వేదిక కార్యాలయంలో జాషువా సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక వేదిక అధ్యక్ష,కార్యదర్శులు ఇనకొల్లు మస్తానయ్య, శేషగిరిరావు, ప్రతినిధులు ఎం. కిషోర్, కే బ్రహ్మయ్య, షేక్ రహీం, జీ వెంకటస్వామి, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతి కార్యక్రమం నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, ఉపాధ్యా యులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, కృష్ణారెడ్డి, మదినా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి.. ప్రాణాలు కాపాడుకోండి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



కావలి: రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంటక కృష్ణారెడ్డి, ఆర్డీవో, ఆర్టీవో తదితరులు

కావలి, జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్లపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించి, ప్రాణాలు కాపాడుకోవాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం, కారులో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్, సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ప్రమాదం జరిగితే... మీరేకాకుండా మీ ఎదుటివారి ప్రాణాలు కూడా తీసిన వారవతారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం. వన్నీవంశీక్రిష్ణ, ఆర్టీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈఐ సుందరరావు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

దగదర్తి (బిట్రగుంట) : దగదర్తి మండలం తడకలూరుకి చెందిన ఇద్దరు గిరిజనులు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. వారి కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. టీడీపీ పేదలకు అండగా నిలిచేపార్టీ అని, బాధిత కుటుంబాలకు తోడుగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతరావు, నేతలు జలదంకి శ్రీహరి, ఇబ్రిన్, పులి శీనయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాధాకృష్ణారెడ్డి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీపీ తాళ్లూరు వెంకట కృష్ణప్రసాద్ నాయుడు కూడా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట తడకలూరు సర్పంచు ఆత్మకూరు గిరిబాబునాయుడు ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం : ఆర్డీవో

ఆత్మకూరు : వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆత్మకూరు ఆర్డీవో బి పావని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసులు, విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రాంభించారు. సీఐ జి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ప్రధాన రహదారి వెంబడి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పలువురు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని గ్రామస్థుల ఆందోళన



ఉదయగిరి: ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన చేస్తున్న కృష్ణారెడ్డిపల్లి గ్రామస్థులు

ఉదయగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామస్థులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటు వ్యవసాయ పనుల్లేక, ఇటు ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమై పలువురు ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారన్నారు. పనులు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని, ఇప్పటికైనా స్పందించి ఉపాధి పనులు కల్పించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

'ఉపాధి' పనులు గుర్తించండి

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కేశ్రీనివాసులు చెప్పారు.బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు, ఫారం పాండ్సు ఏర్పాటు చేసేందుకే, అమృత్ సరోవర్ పథకం కింద సన్నకారు రైతులు గడ్డి పెంపకానికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ చినకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గాజు గుర్తు గుర్తింపుపై జనసేన హర్షం

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసును శాశ్వతంగా రిజర్వు చేయడంపై మండల జనసేన అధ్యక్షుడు ఏ నరసింహరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో జనసేనను చేర్చడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలో కలపొద్దు

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను లింగసముద్రంలోని సౌత్‌పాఠశాలలో ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో కలపొద్దని టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం లింగసముద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో-2 ఎంవీ శివకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ తమ కాలనీలోని పాఠశాలలోని 3,4,5 తరగతులను గతంలో హైస్కూల్‌లో విలీనం చేశారని, ప్రస్తుతం 1,2 తరగతుల విద్యార్థులు 20మంది ఉన్నారని చెప్పారు.లింగసముద్రం సౌత్ పాఠశాలలలో ఏర్పాటు చేసే మోడల్ పాఠశాల కిమీ దూరంలో ఉందని, అందువల్ల చిన్న పిల్లలు అంత దూరం వెళ్లలేరని తెలిపారు. కావున కాలనీలోని పాఠశాలను మార్చవద్దని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎంఈవో-2 తెలిపారు.

న్యూస్ బాక్స్

అట్రాసిటీ కేసు విచారణ

కలువాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లికి చెందిన కోలా వంశీ ఫిర్యాదు మేరకు ఈనెల 19వ తేదీ కలువాయి పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ కేసును బుధవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ గ్రామానికి వచ్చి విచారించారు. ఈనెల 18వ తేదీ తాను మోటారుసైకిల్‌పై వెరుబొట్లపల్లి రోడ్డు వద్దకు వెళ్తుండగా గేదెలు అడ్డురావడంతో హారన్ కొట్టానని, అక్కడ ఉన్న సంకల పవన్ హారన్ ఎందుకు కొట్టావని గొడవపడి తాను తిరిగి గ్రామానికి చేరుకున్న తరువాత మరో ఐదుగురితో కలిసి తమను కులం పేరుతో దూషించి దాడిచేశారని వంశీ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేయగా డీఎస్పీ విచారణ జరిపారు. ఆయన వెంట ఎస్ఐ సుమన్ ఉన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

కొండాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటలో తాగునీటి పైపులైను దెబ్బతిని కొద్దిరోజుల నుంచి నీరు లీకవుతున్నది. ప్రతి ఇంటికి నీరు అందాలనే ఆలోచనతో గ్రామ టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర ఆధ్వర్యంలో బుధవారం పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రెండు కొత్త బోర్లను మంజూరు చేశారని, పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలోని రెండు ఎస్సీ కాలనీలకు తాగునీటి సరఫరా సజావుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ

అనంతసాగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం సీపీఎం జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కళాజాతా బృందం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వేము పెంచలయ్య, గాడి సుధాకర్, సుబ్బారాయుడు, అన్వర్‌బాషా, జక్కరయ్య, మీరామొహిద్దిన్, ఫకూర్‌సా తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి వితరణ

బిట్రగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేదలు, అనాథలకు బోగిరి కుటుంబ సభ్యులు బుధవారం భోజనం, పండ్లు అందచేశారు. అనంతరం రాగాల జాషువా డేనియేల్ మాట్లాడుతూ అమ్మమ్మ బోగిరి మణెమ్మ జ్ఞాపకార్థం సామాజిక కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. క్రైస్తవ సమాధుల తోటకు రెండు వైపులా ఇనుప గేట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాగాల పావని ట్రస్ట్ వ్యవస్థాపకుడు బీ.ప్రభాకర్, బీ.రాజు, రాకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిని కలిసిన అళహరి

కావలిటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఛైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్‌ను బుధవారం జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. శాలువాతో సత్కరించి అభినందించారు.



ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



మొక్కలు నాటుతున్న బ్యాంకు అధికారులు

ఉదయగిరి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు శోభన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటించాలని, ప్రధాన రహదారులు, వీధులు, నివాసాల సముదాయాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం, పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం తదితరులు పాల్గొన్నారు.

● కావలి రూరల్ : విద్య తోనే యువత భవితకు బంగారు బాటలు వేయవచ్చని నెల్లూరు ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్ కే అజయ్ సింహరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోనిజనతాపేట, మెయిన్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం వెంగళరావునగర్‌లోని గురుకుల పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడా-2025 కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చిన్నతనం నుంచే స్వచ్ఛత, పరిశుభ్రత అలవర్చుకోవాలన్నారు. తమ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి ఇచ్చే గృహ, వాహన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కావలి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పద్మలోచన్‌సేతి, జనతాపేట శాఖ మేనేజర్ శ్రీకాంత్, సరళ రుణకేంద్రం మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కుంకు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సందానీ దంపతులకు సన్మానం

ఉదయగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఉదయగిరి పట్టణం దిలార్‌భాయ్ వీధికి చెందిన షేక్ సందానీ, షాహీన్ దపంతులను, చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్‌హుస్సేన్‌లను బుధవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ చెక్కనగిషీ కేంద్రం ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతోపాటు కేంద్రంలో వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. చెక్కనగిషీ కేంద్రానికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరించి అభివృద్ధి చేస్తే మరింత మంది మహిళలు ఉపాధి పొందడంతోపాటు వారి చేతుల్లో నుంచి అద్భుతమైన కళాఖండాలు ఉద్భవిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్‌రజాక్, మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను మార్పు చేయాలి

బిట్రగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఎస్వీపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంక టక్రిష్ణారెడ్డిని కోరినట్లు టీడీపీ మండల యువత అధ్యక్షుడు అన్నంగి ఆదిశేషయ్య తెలిపారు. బుధవారం ఆయన బోగోలులో మాట్లాడుతూ పంచాయతీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 70 మందికిపైగా ఉన్నారని తెలిపారు. పాఠశాలను పదవ తరగతి వరకు పెంచగలిగితే బడిబయట పిల్లల సంఖ్య చాలా వరకు తగ్గుతుందన్నారు. ఈ విషయమై గ్రామస్థులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యేకి వివరించి వినతిపత్రం అందచేశామని అన్నారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ అన్నంగి నరేష్, టీడీపీనేత పెయ్యల శీనయ్య, దళిత నేత కాకి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా సంస్థలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

కావలిటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) బీమా సంస్థల్లో క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపును కొనసాగించాలని ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం నిరసన చేపట్టారు. పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో ఉన్న ఎల్ఐసీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో ఐసీఈయూ కార్యదర్శి రవికుమార్, యూనియన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



